


# విజయభాను

44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 12-03-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 155 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## విశాఖ ఉక్కులో
# సమ్మె సైరన్




నోటీసులు అందజేసిన కార్మిక సంఘాలు

గాజువాక: ఉక్కు ప్రైవేటీకరణ కు కేంద్రం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఉక్కు ఉద్యోగులు చేస్తున్న ఆందోళన రోజురోజుకు ఉద్ధృతమవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఉక్కు పరిశ్రమ లోని 100శాతం పెట్టుబడులు వెనెక్కి తీసుకుని, ప్రైవేటీకరణకు ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ గురువారం సమ్మె నోటీసు ఇచ్చింది. ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలని, సీతమ్మధార భూముల విక్రయ ఒప్పందం రద్దు చేయాలని, పోస్కోతో జరిగిన ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ

తరువాయి 2లో..

# ఆదియోగికి అభిషేకం

## మహా శివరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం జగన్



గుడివాడ : ఆదియోగికి సీఎం జగన్మోహనరెడ్డి చేతులమీదుగా అభిషేకం జరిగింది. ఈ ఏడాది మహాశివరాత్రి పర్వది నాన్ని సీఎం జగన్ కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలో వేలాది మంది భక్తుల సమక్షంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. అద్భుతమైన శివుని రేయి మహాశివరాత్రిని ఆధ్యాత్మికం, ఆహ్లాదం, జాగారం పేరుతో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), సోదరుడు కొడాలి నాగేశ్వరరావు(చిన్ని)ల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తుండగా, ఆదియోగికి ఆతిథ్యమిస్తున్న ఎన్టీఆర్ స్టేడియానికి ఉదయం 11.30 గంటలకు సీఎం జగన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా నర్మదా నదీ తీరంలో ఉద్భవించిన పరమ పవిత్రమైన తేజోలింగమునకు మహారుద్ర, చతుర్వేద మంత్రోచ్చారణల మధ్య సీఎం జగన్ అభిషేకం చేశారు. శివునికి అభిషేకం చేస్తే సర్వరోగాలు నశిస్తాయని, సంపూర్ణ ఆయుర్భాగ్యాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం. మానవ జీవితంలో సుసంపన్నమైన, అభివృద్ధికరమైన అదృష్టాన్ని ప్రసాదించే ప్రక్రియ పూర్ణాహుతిని సీఎం జగన్ చేతులమీదుగా నిర్వహించారు. దీంతో మంత్రి కొడాలి నాని చేపట్టిన మహాసంకల్పం నెరవేరినట్లైంది. పట్టువస్త్రంలో వివిధ రకాల సుగంధ పరిమళాలతో కూడిన పదార్థాలను వేద మంత్రాల నడుమ అగ్ని గుండంలో వేయడం వల్ల పూజల ఫలితం సిద్ధించడంతో పాటు ఆ పూజలను ఏ లక్ష్యంతో చేశారో ఆ దేవతల ఆకృతి యజ్ఞగుండంలోని మంటల్లో కన్పిస్తుందని వేద పండితులు చెబుతుంటారు. ఇదిలా ఉండగా పరమశివుని కృపా కటాక్షాలను సీఎం జగన్మోహనరెడ్డికి సిద్ధింపజేయాలనే మహా సంకల్పంతో ఈ మహాశివరాత్రి పర్వదినాన సూర్యోదయం నుండి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు మహారుద్ర పారాయణం, రుద్ర హెూమం, సహస్ర లింగార్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శివ పార్వతుల కళ్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను జరుపుకునేందుకు జాగరణ దీక్షను సంకల్పించడం విశేషం.

కాగా మహాదేవుని ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలపై ఉండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రాష్ట్ర ప్రజలకు సీఎం

తరువాయి 2లో..



# ప్రాణాల కంటే ప్రజాస్వామ్య పరిరక్షణే ముఖ్యం

- పంచాయితీ ఎన్నికల అనంతరం మున్సిపాలిటీ ఎన్నికల మధ్య స్వల్ప సమయంలో మొదటి డోస్ వాక్సినేషన్ 90% శాతం మందికి పూర్తి చేశాం
- వ్యాక్సినేషన్ వేసుకొని నగర, పుర పోరు ఎన్నికల్లో విధులు నిర్వహించిన పోలీసులు
- పోలీస్ క్లినిక్ లో కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న డిజిపి గౌతం సవాంగ్

అమరావతి : పోలీసులకు తమ ప్రాణాల కంటే ప్రజాస్వామ్య పరిరక్షణకు ముఖ్యమని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రాణాలను వడ్డీ పోరాడేది ఒక పోలీసు లేనని ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలియజేశారు. గురువారం అమరావతి లోని పోలీస్ క్లినిక్ లో కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తాన్ని కరోనా వైరస్ స్తంభింపజేసిన సమయంలో ప్రజలంతా ఇంటికే పరిమితమయ్యారు. ఆ సమయం లో ఏ ఒక్క పోలీస్ కూడా డ్యూటీ నుండి తప్పించుకోకుండా పగలనక, రేయనక, ఎండనక, వాననక, ప్రజారోగ్యం కోసం, ప్రజా శ్రేయస్సు కోసం అహెూరాత్రం శ్రమించి తమ

తరువాయి 2లో..

మాజీ కేంద్ర మంత్రి డాక్టర్. టి. సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం ఆర్. కె. బీచ్ వద్ద కన్నుల పండువగా జరిగాయి. టిఎస్సార్, శ్రీ శారదాపీఠం పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహా స్వామి, ఉత్తర పీఠాధిపతి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి లు ఉదయం మహా కుంభాభిషేకాన్ని ప్రారంభించారు.ం



# పక్కాగా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

## జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్



### ఆర్.ఓ, ఏ.ఆర్.ఓ.లదే ప్రధాన బాధ్యత
### స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి
### నియమ నిబంధనల ప్రకారం లెక్కించాలి
### పొరపాట్లు చేయవద్దు

విశాఖపట్నం : జిల్లాలో జివిఎంసి, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీలకు నిర్వహించే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అథారిటీ జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. గురువారం వి.ఎం. ఆర్.డి.ఎ.చిల్డ్రన్ ఎరీనా లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఆయన పలు సూచనలు చేశారు.

బ్యాలెట్ పేపర్ చెల్లుబాటు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని బ్యాలెట్ పేపర్ అభ్యర్థుల తరపున ఏజెంట్లకు చూపించే లెక్కింపు చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ ల చెల్లుబాటుకు సంబంధించి అంశాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపులో తెలిసి చేసినా, తెలియక చేసినా చర్యలు తప్పవని గుర్తించాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ను లెక్కించాలని, తరువాత మిగిలిన బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కించడం మొదలవుతుందన్నారు. లెక్కింపునకు సంబంధించి వివిధ ప్రొఫార్మాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రౌండ్ పూర్తయిన వెంటనే కౌంటింగ్ ఏజెంట్లకు వివరాలను తెలియజేసి వారి సంతకాలు తీసుకోవాలన్నారు. రౌండ్లవారీ లెక్కింపులో పొరపాట్లు రాకుండా చూసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి బ్యాలెట్ బాక్సులు వచ్చిన వెంటనే 25 చొప్పున కట్టలు కట్టాలని, లెక్కింపు పూర్తయిన వెంటనే అభ్యర్థుల వారీగా కట్టకు 50 చొప్పున భద్రపరచాలన్నారు. ప్రణాళిక ప్రకారం లెక్కింపు నిర్వహించినట్లైతే ఎటువంటి తప్పులకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమం ప్రారంభంలో జీవీఎంసీ కమిషనర్

తరువాయి 2లో..





# ఆరోగ్యభారత్ లో భాగస్వాములు కావాలి

## -నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త డి.శ్రీనివాసరావు వెల్లడి-




శ్రీకాకుళం : ఆరోగ్య భారత్ ఆవిష్కరణకు ప్రతీ ఒక్కరూ కలిసికట్టుగా ముందుకురావాలని శ్రీకాకుళం జిల్లా నెహ్రూ యువక కేంద్రం సమన్వయ అధికారి డి.శ్రీనివాసరావు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వద్ద నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ జంక్షన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125 ఏళ్ల జయంతి ఉత్సవాల సందర్భంగా ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 60 రోజుల పాటు పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కేంద్ర యువజన మంత్రిత్వశాఖ వారి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఈ ఫిట్ ఇండియా అవగాహన కార్యక్రమాలను చేపడతున్నామని ఆయన వెల్లడించారు. వచ్చే నెల 20 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. భారత ప్రధాని పిలుపు మేరకు శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా ఫిట్ ఇండియా ఉద్యమాన్ని పెద్దఎత్తున చేపడుతున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య భారత్ ఆవిష్కరణలో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు నడక పోటీలు,యోగా, సైకిల్ ర్యాలీ లు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి. ఇందిరా ప్రసాద్,కూన వెంకట రమణ మూర్తి,గురు ఆనంద రావు,ఎం.మల్లిబాబు,జర్నలిస్టుల ఐక్యవేదిక కన్వీనర్ శాసపు జోగి నాయుడు తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధికి అవరోధకులుగా ఉన్న శత్రువులను సీఎం జగన్మోహనరెడ్డి జయించాలి

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని

గుడివాడ : అభివృద్ధికి అవరోధకులుగా ఉన్న శత్రువులను సీఎం జగన్మోహనరెడ్డి జయించాలని, పరమశివుని కృపా కటాక్షాలను ఆయనకు సిద్ధింపజేయాలనే మహాసంకల్పంతోనే ఈ ఏడాది మహాశివరాత్రి పర్వదిన వేడుకలను కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించినట్టు రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చెప్పారు. గురువారం సీఎం జగన్మోహనరెడ్డితో కలిసి మహాశివరాత్రి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షించాలని, రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని, రాష్ట్ర ప్రజల శ్రేయస్కరార్థం, ప్రజలు సంపూర్ణ ఆరోగ్య, విద్య, ఉద్యోగ భాగ్యాలను సమకూర్చాలనే ధృడ నిశ్చయంతో, ప్రజలు, రాజకీయ నాయకులు, ధర్మ మార్గాల్లో నడుచుకోవాలనే చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్న సీఎం జగన్మోహనరెడ్డికి పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహం లభించాలన్న ఉద్దేశ్యంతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేందుకు సంకల్పించామన్నారు. సూర్యోదయం నుండి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు మహారుద్రాభిషేకం, రుద్ర హెూమం, సహస్ర లింగార్చన, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శివ పార్వతుల కళ్యాణం తదితర కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు జాగరణ దీక్షను చేపట్టామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పరమశివుడిని ఆనందపర్చే ఈ వేడుకలను భక్తులు, ప్రజలందరినీ ఆహ్వానించామన్నారు. ప్రముఖ సినీ సంగీత దర్శకులు పార్థు నేమాని, ప్రముఖ సినీ గాయని గీతామాధురి బృందం కైలాసవాసికి స్వరాభిషేకంతో ఆహ్లాద పరుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, సమాచారశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ప్రభుత్వ కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు, మొండితోక జగన్మోహనరావు, వల్లభనేని వంశీ, అధికార భాషా సంఘం చైర్మన్ పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ అడపా బాబ్జి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు మండలి హనుమంతరావు, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నందివాడ మండల అధ్యక్షుడు పెయ్యల ఆదాం, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, ఏరియా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి సంఘం చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, వైసీపీ నాయకులు పాలడుగు రాంప్రసాద్, కీర్తికుమార్ జీవావత్,



పొట్లూరి వెంకట కృష్ణారావు, గాదిరెడ్డి రామలింగారెడ్డి, రావులకొల్లు సుబ్రహ్మణ్యం, మల్లేశ్వరరావు, అద్దేపల్లి పురుషోత్తం, ఉప్పాల రాంప్రసాద్, రాము, కొంకితల ఆంజనేయప్రసాద్, మాదాసు వెంకటలక్ష్మి, జిల్లా కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ టీ మాధవీలత, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, గుడివాడ ఆర్డీవో జీ శ్రీనుకుమార్, మున్సిపల్ కమిషనర్ పీజే సంపత్‌కుమార్, గుడివాడ డీఎస్పీ ఎన్ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

# రాజాంలో ఆదిమానవుల ఆనవాళ్లు

### రాజయ్యపేటలో బయటపడిన ఆది మానవుల ఆనవాళ్లు



రాజాం : శ్రీకాకుళం జిల్లా రాజాం మండల పరిధి రాజయ్యపేట గ్రామంలో నవీన శిలాయుగ ఆనవాళ్లు లభించాయని రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం తెలిపారు. ఆయన మాట్లాడారు. రాజాం చరిత్ర రచనలో భాగంగా రాజయ్యపేట వెళ్లానన్నారు. అక్కడ మంచినీటి కోనేరు దక్షిణ గట్టున ఉన్న తుప్పల మధ్య బండరాతి మీద లోతుగా చెక్కినట్టు ఉన్న గుర్తులను గమనించానని, అవి క్రీస్తు పూర్వం నాలుగువేల సంవత్సరాల నాటివని తెలిపారు. ఆదిమానవుడు ఆధునికుడయ్యే క్రమంలో రాతి బండలమీద, కొండలమీద నల్ల శానపు రాళ్లను అరగదీసి పనిముట్లుగా మార్చుకునేవాడని, ఆ విధంగా ఏర్పడినవే ఆ రాతి గోతులని వివరించారు. ఈ విషయాన్ని విజయవాడ ఆర్కియాలజీ సాంకేతిక నిపుణులు లీలా సుబ్రహ్మణ్యంతో సంప్రదించి ధ్రువీకరించామని వెల్లడించారు. రాజాంలో పురావస్తు శాఖ వారు పరిశీలిస్తే చాలా విషయాలు బయటపడతాయని అన్నారు.

# పెన్నా నదిలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

వల్లూరు: కడప జిల్లా పుష్పగిరి ఆలయం సమీపంలోని పెన్నా నదిలో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ముద్దనూరు మండలం థర్మల్ గ్రామంలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు.. వల్లూరు పరిధిలోని పుష్పగిరి పుణ్యక్షేత్రానికి వెళ్లారు. పుష్పగిరి కొండపై వెలసిన సంతాన మల్లేశ్వర స్వామి, చెన్నకేశవులను దర్శించుకున్నారు.

# విశాఖ ఉక్కుపై తక్షణమే అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేయండి

## - సీఎం జగన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ



అమరావతి: కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేస్తోందని.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఈ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఆంధ్రుల ఆత్మాభిమానం, ఉద్యమస్ఫూర్తికి గుర్తుగా నిలిచిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విక్రయించాలంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాన్ని విరమించుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రధాని మోదీకి సీఎం లేఖ రాయడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. స్టీల్ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగాయని లేఖలో రామకృష్ణ పేర్కొన్నారు. “ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం విశాఖపట్నంలో 19,700 ఎకరాల భూమిని ప్రజల నుండి సేకరించారు. ప్రస్తుతం ఆ భూముల విలువ సుమారు రూ.లక్ష కోట్లకుపైగా ఉంటుంది. అలాంటి విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది ఆంధ్రులకు తీరని ద్రోహం చేయడమే. తెలంగాణ మంత్రి కేటీఆర్ కూడా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమానికి మద్దతు పలికారు. తన పూర్తి సహకారం అందిస్తామన్నారు. ప్రముఖ సినీనటుడు చిరంజీవి సైతం విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు. ఇలాంటి తరుణంలో రాజకీయాలకు అతీతంగా మనమంతా ఒక్కటై మరోసారి ‘విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు’ అని గళమెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్రం దిగొచ్చే వరకు రాజకీయాలను పక్కనపెట్టి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి.

ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి” అని రామకృష్ణ కోరారు.

మొదటి పేజీ తరువాయి

# విశాఖ ఉక్కులో సమ్మె సైరన్

ఉక్కు సీఎండీకి సమ్మె నోటీసు అందజేశారు. ఆర్-కార్డు ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 14 రోజుల తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని ఉక్కుపరిరక్షణ పోరాట కమిటీ స్పష్టం చేసింది. విశాఖ ఉక్కు... ఆంధ్రుల హక్కు, అమ్మేదెవరు... కొనేదెవరు..అంటూ ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు, ఉద్యమకారులు నినాదాలతో గత కొన్ని రోజులుగా విశాఖలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తున్నామని సోమవారం పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి చేసిన ప్రకటనతో నిరసనలు మరింత ఉధృతమైన విషయం తెలిసిందే. ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఉదయం స్టీలుప్లాంటు పరిపాలన భవనాన్ని ఉద్యోగులు ముట్టడించారు. ఈ క్రమంలో స్టీలుప్లాంటు డైరెక్టర్ (ఫైనాన్స్) వేణుగోపాలరావు రాగా.. ఆయన కారును చుట్టుముట్టి కదలకుండా ఆపేశారు. సుమారు ఆరు గంటల పాటు డైరెక్టర్‌తో పాటు హెచ్‌ఆర్ విభాగం ఈడీ బాలాజీని చెట్టు కిందే నిలబెట్టేశారు. ప్రజాప్రతినిధులంతా రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొనాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. సమ్మె నోటీస్ అందించినవారిలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్,ఆదినారాయణ, అయోధ్యరమ్ గంధం వెంకటరావు,విల్లా రాంమోహన్, మస్తానప్ప, సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

# పక్కాగా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

అదనపు ఎన్నికల అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రాధమికమైన సమాచారాన్ని ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లను నియమించే క్రమంలో వారికి నియమ నిబంధనలు గూర్చి, కరోనా జాగ్రత్తలను గూర్చి తెలియజేయాలన్నారు.

జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగార్జునసాగర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఓట్ల లెక్కింపు విధివిధాలను వివరించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఎన్. మౌర్య, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, జి.వి.యం.సి ఎడిషనల్ కమీషనర్ ఆశా జ్యోతి , జోనల్ కమీషనర్ లు, ఆర్.ఓ.లు, ఎ.ఆర్.ఓ.లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాల కంటే ప్రజాస్వామ్య పరిరక్షణే ముఖ్యం

ప్రాణాలను, కుటుంబలను సైతం లెక్కించక, ప్రజారోగ్యం, ప్రజల బద్రత కు అత్యంత ప్రాముఖ్యతనిస్తూ విధులను నిర్వహించిన పోలీసు సిబ్బంది యొక్క త్యాగం మాటలకందనిదని తమ సిబ్బంది సేవలను కొనియాడారు. ఈ క్రమంలో కరోనా వ్యాప్తి కట్టడికి మనం ముందుండి సాగించిన పోరాటంలో 110 మంది పోలీసులు ప్రాణ త్యాగం చేశారు.ప్రజల రక్షణ కోసం వారు చేసిన త్యాగాలు ఎన్నటికీ మరువలేనివి ఆ మహనీయులకు మన సెల్యూట్. వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చినప్పటికీ,అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వచ్చాయి.ఇటువంటి క్లిష్ట సమయంలో పోలీసులు తమ ప్రాణ రక్షణ కంటే ప్రజాస్వామ్య పరిరక్షణకు మొదటి ప్రాధాన్యతనిస్తూ “డెమోక్రసfirst-self care next అనే నినాదంతో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని త్యాగం చేశారు. కోవిడ్ సమయంలో ప్రజలు నిత్యం పూజించే దేవాలయాలు సైతం మూసుకున్న తరుణంలో పోలీస్ స్టేషన్లు, పోలీసులు మాత్రం ప్రజల ధన, మాన,ప్రాణ రక్షణే కింకర్తవ్యంగా, ఇదొక మహా భగవత్ పవిత్ర కార్యంగా భావించి అత్యుత్తమ సేవలు అందించారు. రాజ్యాంగం పట్ల గౌరవంతో విది నిర్వహణలో మీరు చూపిన అంకితభావానికి మరియు ఈ కఠిన సమయంలో మన వెన్నంటి ఉండి ప్రోత్సహించిన కుటుంబ సభ్యులందరినీ అభినందిస్తున్నాను. మిగిలిన సిబ్బంది వేగంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయించుకోవాలి. ప్రజలు వ్యాక్సిన్ పై అపోహలు విడనాడి,ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ తీసుకోవాలి. భారతదేశం ప్రపంచంలోనే మరెక్కడా లేని విధంగా ప్రజలకు వ్యాక్సినేషన్ ని అందుబాటులోకి తీసుకురావడం మనమంతా గర్వించదగ్గ విషయం.

# ఆదియోగికి అభిషేకం



జగన్ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగను జరుపుకున్న సీఎం జగన్, ఈ ఏడాది మహాశివరాత్రిని కూడా జరుపుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, సమాచారశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని), దేవాదాయశాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ప్రభుత్వ కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు, మొండితోక జగన్మోహనరావు, వల్లభనేని వంశీ, అధికార భాషా సంఘం చైర్మన్ పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.







# అచ్యుతాపురం గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి

## సర్పంచ్ కూండ్రపు వి.కె.వెంకునాయుడు



అచ్యుతాపురం : ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తి రాజు (కన్నబాబురాజు )సహకారంతో అచ్యుతాపురం గ్రామ పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ కూండ్రపు విమల కుమారి వెంకునాయుడు అన్నారు . గురువారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో గ్రామాభివృద్ధిలో భాగంగా డ్రైనేజి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ వి.కె.వెంకునాయుడు భూమి పూజ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్దే ధ్యేయంగా పనిచేసి పంచాయతీని అభివృద్ధి బాటలో నడి పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్య నారాయణ, దాసరి లక్ష్మణరావు, వెంకన్న, కట్టమూరి శ్రీను, టింకు, కరుణ, వినోద్, నరేంద్ర, రాజు, అప్పారావు, నాని, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల కోసం

## ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించిన వివేకానంద సంస్థ...



విశాఖపట్నం : వన్టౌన్లో ఉన్న వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ.. వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించింది. ఏజ్ కేర్ ఫౌండేషన్ వైద్య బృందం.. వృద్ధులకు.. బిపి, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించింది.

వైద్య పరీక్షల అనంతరం వారికి నెల రోజులకు సరిపడ మందులను ఉచితంగా అందజేశారు. వృద్ధులు ప్రతీ నెలా తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించు కోవాలని వైద్యులు సూచించారు.

# మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శివునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు నాగ సాయి శర్మ

కొయ్యూరు : కొయ్యూరు శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివ రాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అన్నదానం చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా విశాఖ జిల్లా ప్రాంతాలనుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయించు కున్నారు. పండితులు నాగసాయి శర్మ భక్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 2000 వేల మందిపైగా పూజలు అభిషేకాలు చేయించుకున్నారు. శ్రీశ్రీశ్రీ మల్లికార్జునస్వామి ఆల యంలో కోరిన కోరికలు తీరు తాయని, మీ చుట్టుపక్కల ప్రజల ప్రగాఢ నమ్మకం. ప్రతి యేటా శివరాత్రి ఉత్సవాలను ఆలయ కమిటీ ఎంతో ఆర్భాటంగా నిర్వహిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా అలాగే వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకాడ బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు మొట్టడం వీరయ్యదొర, అనిశెట్టి చిరంజీవి, ఎంవీవీ అశోక్, మెడిబోయిన సత్తిబాబు, చిన్న, తోట దొరబాబు, ఆలయ వేద పండితులు నాగ సాయి శర్మతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గన్నారు.

అదే విధంగా మండలంలో పెదమాకవరం గ్రామంలో బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో, వలసం పేట, గిరిజతాండవ ఈశ్వర స్వామి, చింతలపూడి దుర్గా మల్లేశ్వర స్వామి, మాకవరం శివాలయంలో యూ.చీడిపాలెం దగ్గరలో గల పూతి గుంట ఆలయాల్లో శివునికి భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేయించుకున్నారు.



ఆలయం వద్ద భక్తులు

# ఘనంగా శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం



పాడేరు : విశాఖ ఏజెన్సీ హుకుంపేట మండలం మత్స్యగుండం లో కొలువై ఉన్న శ్రీ మత్స్య లింగేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా శివరాత్రి సంబరాలు ప్రారంభమైంది. వేలాది మంది భక్తులు వచ్చి భక్తిశ్రద్ధలతో మత్స్య లింగేశ్వర స్వామి ని పూజించుకొని మత్స్యగుండం లో కొలువై ఉన్న మత్యలను దర్శిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా పాడేరు డివిజన్ గిరిజన పాత్రికేయుల ఆధ్వ ర్యంలో అన్నసంతర్పణ పులిహోర మంచినీరు సరఫరా చేశారు. అంతే కాకుండా ఆలయ కమిటీ కి అన్నసంతర్పణ కు 30 బస్తాల మంచినీటి ప్యాకెట్లు సరఫరా చేశారు. ప్రతియేటా మత్స్యగుండం తోపాటు పలుచోట్ల శివరాత్రి సందర్భంగా గిరిజన పాత్రికేయులు పలు సేవా కార్యక్రమాలు చేస్తూ వారి సేవా దృక్పధాన్ని చాటుకుంటున్నారు. స్థానిక ప్రాజెక్ట్ అధికారి మత్స్య లింగేశ్వర స్వామి ని దర్శించుకుని అధికార లాంఛనాలతో శివరాత్రి మహోత్సవాలను నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఉత్సవ కమిటీని భక్తులందరూ సహకరించి మొక్కలను తీర్చుకొని మత్స్య లింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. పాడేరు శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మి మత్య లింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు కొనసాగుతుందని ఆలయ కమిటీ ,ఉత్సవ కమిటీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# శివనామస్మరణతో మారుమోగిన పూడిమడక



అచ్యుతాపురం : మహాశివరాత్రి సందర్భంగా మత్స్యకార గ్రామమైన పూడి మడక శివారు కొండపాలెం శివనామ స్మరణతో మారుమోగింది.

గురువారం పూడిమడకలో సముద్రతీరాన స్వయుం భుగా వెలసిన శివున్ని (శివలింగాన్ని) భక్తులు ఉదయం నుంచే దర్శించికొని పూజలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించి శివున్ని ఆరాధించారు.

# ఏబివిపి 39వ రాష్ట్ర సభలు పోస్టర్ ఆవిష్కరణ



భీమునిపట్నం : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబివిపి 39 రాష్ట్ర మహాసభలు ఈ నెల 14,15 తేదిలలో విజయనగరంలో ఈ మహా సభలు జరగనున్నట్లు విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ లొడగల అచ్చిబాబు తెలిపారు. ఈ పోస్టర్ ను శ్రీ క్రిష్ణ జూనియర్ & డిగ్రీ కళాశాల చైర్మన్ బి.నర్సింగ్ రావు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏబివిపి దేశం కోసం,ధర్మం కోసం పనిచేస్తున్న విద్యార్థులు యొక్క సమస్యల పై నిరంతరం రాజీ లేని పోరాటం చేస్తుందని అన్నారు. అలాగే ఈ నెల 14,15 తేదిలలో విజయనగరంలో జరగ నున్న రాష్ట్ర మహాసభలు విజయ వంతం చేయాల తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సి పాల్ సింహాచలం ,దువ్వు వెంకటేష, బోద లోకేష్, గణేశ్, శ్రీను, లోకేష్, చరణ్, వెంకటేష్, రాము, కల్యాణ్, వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అఖండ హరినామ సంకీర్తన



విశాఖపట్నం : శివరాత్రి సందర్భంగా గురువారం అల్లిపురం గోకుల్ థియేటర్ శివాలయం వద్ద అఖండ హరినామ సంకీర్తనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్కల్ యువ సేవా సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై శుక్రవారం ఉదయం 10 గంటల వరకు సాగింది. తొలుత శ్రీకృష్ణని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ కలియుగంలో మోక్షసాధనకు యజ్ఞాలు,యాగాలు,తపస్సు చేయనవసరంలేదని హరినామ స్మరణ చేస్తే చాలని పేర్కొన్నారు. కార్తీకపౌర్ణమి, రథసప్తమి,శివరాత్రి పర్వ దినాల్లో తమ బృందంతో కలిసి ఏకహం వాహనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో మహాదేవునికి అభిషేకాలు







మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంతంలో శివాలయాల్లో భక్తులు శివనామ స్వరంతో హోరెత్తించారు. పిఎం పాలెం ఆఖరి బస్ స్టాప్ వద్ద ప్రసిద్ధిగాంచిన ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. స్వయంగా 108 శివ లింగాలుకు భక్తులు అభిషేకం చేసుకునే అవకాశం ఉండటంతో వేకువజామునుంచే భక్తి శ్రద్ధలతో శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఆలయమును కమిటీ వారు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా చంద్రంపాలెం జాతర గట్టుపై వెలసిన శ్రీదుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో ఉన్న శివలింగానికి ఆలయ అర్చకులు పట్నాల సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో ప్రేత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు, తెల్లవారి నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వయంగా మహాదేవునికి అభిషేకాలు,పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిల్లా కృష్ణంనాయుడు, ఆలయ కమిటీ అధ్యక్షులు పిల్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, కనకమహాలక్ష్మి మరియు సత్య నారాయణ రాజు, పార్వతి దంపతులు పూజా కార్యక్రమాలలలో పాల్గొన్నారు అలాగే పీఎం పాలెం చివరి బస్సు స్టాప్ సమీపంలో ఉన్న శ్రీ శృంగేరి శంకరమఠంలో ఆలయ నిర్వాహక అధికారి జాగర్లపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శివాలయంలో ప్రేత్యేక పూజాది అబి.షేకాలు నిర్వహించారు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విజయభాను

## సంపాదకీయం

### దేశ రక్షణలో యువత పాత్ర కీలకం

మన దేశం ఏ సమస్యల్లో చిక్కుకున్నా సామరస్యంతో, శాంతియుతంగా పరిష్కరించుకున్నదే కానీ ఏ దేశంపైనా దాడి చేయలేదని, చైనా వలె ఆకస్మిక దురాక్రమణలకు పాల్పడలేదని పీవీ అన్నారు. దేశ రక్షణలో యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. చైనాతో యుద్ధం సమయంలో దేశ యువతనుద్దేశించి పీవీ నరసింహారావు రాసిన ప్రత్యేకం వ్యాసం ఇది.

గత పదిహేనేండ్లలో మన విదేశాంగ ఆంతరంగిక విధానాల్లో బింబప్రతిబింబ భావమెంత వరకు కనిపించింది? ప్రపంచ దేశాలన్నింటికీ శాంతిపాఠాలు చెప్పి మనం చిల్లర మల్లర ఆంతరంగిక వ్యవహారాల్లో అశాంతి మార్గాలను అవలంబించకూడదు. విశ్వమానవ సమైక్యతను, సమానత్వాన్ని ఉద్బోధించిన మనం అడుగడుగునా కుల, మత, వర్గ, వ్యక్తి ద్వేషాలకు అవకాశమివ్వకూడదు.

మన దేశం శాంతి కాముకదేశం. మన జాతి ఎన్నడూ ఒకరితో కయ్యానికి కాలు దువ్వలేదు. మరొక దేశంపైన దాడి చేయలేదు. ఒకరి భూభాగం పైన కన్ను వేయలేదు. విశ్వ మానవ సౌభ్రాతృత్వానికీ, శాంతియుత సహజీవనానికీ మనమే బాటలు వేశాం. ఎంత విషమ సమస్యనైనా సరే, సామరస్యం ద్వారా పరిష్కరించవచ్చునని విశ్వసించాం. ఆ విశ్వాసాన్ని పురస్కరించుకొని అనేక సమస్యల పరిష్కారంలో సముచిత పాత్ర నిర్వహిస్తూ వచ్చాం. ఇదే మన సిద్ధాంతం. ఇదే మన సంప్రదాయం.

కానీ కాలం తారుమారైంది. శాంతికాముకత్వమంటే బలహీనత అనీ, సామరస్య ప్రవృత్తి అంటే చేతగానితనమనీ, సహజీవన విధానమంటే నిష్క్రియత్వమనీ- మన పొరుగుదేశమైన చైనా పాలకులు అపార్థం చేసుకున్నారు. అవసరమున్నా లేకున్నా యుద్ధానికే అలవాటుపడ్డ వారైనందున శత్రుదేశమేదీ అనువుగా కనపడలేదని మిత్రదేశంపైనే బలమదాలను ప్రదర్శించబూనారు. ప్రపంచ చరిత్రలో ఇటీవల కనీవినీ ఎరుగని అమానుషత్వం, శఠత్వం, సామ్రా జ్య కాంక్ష వారివేనన్న శాశ్వత దుష్కీర్తిని సాధించుకున్నారు. అయితే చైనా సేనల ఆకస్మిక దురాక్రమణకు భారతదేశం మరింత కాకలు తీరిందే కానీ చలించలేదు, ఛిన్నాభిన్నం కాలేదు. దేశ చరిత్రలో ఎన్నడూలేని ఉత్సాహం, ఐక్యభావం, నవ చైతన్యం చైనా దండయాత్ర ఫలితంగా వెల్లివిరిశాయి. ఈ నవ చైతన్యాన్ని సంఘటితపరచడమే నేడు మన ప్రథమ కర్తవ్యం.

ఏ ఉద్యమమైనా యువజనుల ఉత్సాహంతోను, అనుభవజ్ఞుల సలహా సంప్రదింపులతోను ముందుకు సాగుతుంటుంది. కావున నేటి దురాక్రమణను ప్రతిఘటించే కార్యక్రమం కూడా ప్రజా ఉద్యమ స్వరూ పం దాల్చవలెనంటే యువకులే దానికి వెన్నెముకగా నిలువక తప్పదు. దేశ రక్షణ కార్యక్రమంలో యువకులు ఏం చేయాలో చెప్పాలంటే, ఇంతవరకు యువకులేం చేస్తూ వచ్చారో క్లుప్తంగా సమీక్షించడం అసంగతం కాదనుకుంటాను. స్వాతంత్ర్యాన్ని ఒకసారి సాధించామంటే చాలు, అది ఎల్లకాలం సుస్థిరంగా తనంత తానే ఉంటుందన్న భావం మన దేశంలో కనీసం పరోక్షంగానైనా ప్రబలిందని అంగీకరించాలి. స్వాతంత్ర్య సముపార్జనం సందర్భంలో అశేష త్యాగాలు చేసి అచంచల దీక్షను ప్రదర్శించిన దేశ సేవకులెందరో రంగం నుంచి రాలిపోవడమో, తప్పుకోవడమో జరిగింది. నేటి యువకుల్లో చాలామంది స్వతం త్ర వాతావరణంలోనే జన్మించినవారు, బుద్ధి తెలిసినవారు. స్వాతంత్ర్య ఫలితాలకై పరస్పరం పోటీలు పడుతున్న సందర్భంలోనే వారి చైతన్యం ప్రారంభమైంది. వారు మల్లెపూలలా కనిపించే బియ్యాన్ని మాత్రమే చూశారు. కానీ ఎన్నిసార్లు దున్నితే, ఎన్ని నెలలు కష్టపడితే, ఎన్ని వడగండ్లను సహిస్తే, ఎన్ని కొడవళ్ళతో కోస్తే, చివరికి ఎన్ని రోకండ్లతో దంచితే ఆ బియ్యం తయారయ్యాయో తెలుసుకుంటేనే కాని వాటి విలువ తెలియదు. కావున భారత స్వాతంత్ర్య సమర చరిత్రను సమగ్రంగా తెలుసుకొని కేవలం మేధాపరంగానే కాక భావనాత్మకంగా నాటి త్యాగపూరిత వాతావరణంలో తాదాత్మ్యం పొందడం నేటి యువకుల ప్రథమ కర్తవ్యమైయున్నది.

## మావోయిస్టులకు వ్యతిరేకంగా కొవ్వొత్తుల ప్రదర్శన



విశాఖపట్నం జిల్లా: మావోయిస్టులకు వ్యతిరేఖంగా గూడెం కొత్తవీధి మండలం సీలేరులో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానికులు, విద్యార్థులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పిల్కును మావోయిస్టులు ఇన్‌ఫార్మర్‌గా ముద్ర వేసి హతమార్చిన ఘటనకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గురువారం సాయంత్రం స్థానిక రామాలయం కూడలి నుంచి ర్యాలీగా పెద్ద ఎత్తున గిరిజనులు, విద్యార్థులు కొవ్వొత్తుల చేతపట్టుకుని స్థానిక మెయిన్ రోడ్డు కూడలి వరకు శాంతి ప్రదర్శన చేశారు.

అనంతరం స్థానిక మెయిన్ రోడ్ లో మానవహారం నిర్వహించి మృతిచెందిన పిల్కుకి ఆత్మశాంతి కలగాలని మౌనం పాటించారు.

## విశాఖ ఏజెన్సీ ధారకొండ ఘాట్ లో దొంగలు కలకలం



సీలేరు : ధారకొండ ఘాట్‌రహదారిలో గురువారం రాత్రి మరోసారి దోపిడి దొంగలు కలకలం విశాఖ మన్యంలో ధారకొండ ఘాట్ రోడ్డులో దొంగలు మరో సారి దోపిడీకీ ప్రయత్నించారు. ఈ క్రమంలో దొంగలు నుంచి తప్పించుకునే ప్రయత్నంలో కారు బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దొంగలను గాలించడానికి వెళ్తున్న ద్విచక్రవాహనం బోల్తాపడి మరొక యువకునికి గాయాలయ్యాయి. ధారకొండకు చెందిన రాజు తన స్నేహితులతో కలిసి గురువారం సాయంత్రం చింతపల్లి నుంచి వస్తుండగా ధారకొండ ఘాట్ రహదారిలో ధర్మాపురం వద్ద నలుగురు యువకులు రెండు ద్వచక్ర వాహనాలు పై వచ్చి కారు ను అడ్డంగా నిలిపి కత్తులు, నాటుతుపాకీలతో కారులో ఉన్నవారిని బెదిరించడానిక ప్రయత్నించారు. దీంతో అప్రమత్తమైన వాహనం నడుపుతున్న రాజు వేగంగా కారును పోనిచ్చాడు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో దొంగలు పరారయ్యారు. విషయాన్ని సెల్‌ఫోన్ ద్వరా ధారకొండ గ్రామస్థులకు తెలియజేయడంతో సుమారు 60 మంది యువకులు మూడు బృందాలుగా ఏర్పడి ద్విచక్రవాహనాలపై సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఈ క్రమంలో సంఘటనా స్థలానికి వెళుతున్న ద్విచక్రవాహనం బోల్తాపడటంతో గోవిందు అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి.

## పార్టీ ఉన్నంతవరకు కాదు.. ప్రాణం ఉన్నంత వరకు రాజన్న సైనికుడిని

*- ఎం.ఆర్ పేరు వింటే యువత లో నవ చైతన్యం - రాజన్న విడిచిన బాణం మల్ల రవి కుమార్ ఎం.ఆర్*




పలాస నియోజకవర్గం : పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎలక్షన్స్ ప్రచారంలో భాగంగా మన డాక్టర్ సీదిరి అప్పలరాజు కి స్వాగతం చెప్తు పూలమాలలు వేసి, పూల వర్షం కురిపిస్తున్న మన పలాస నియోజకవర్గ ప్రజలు.. మన రాజన్న కు అత్యంత ఆప్తుడు, విధేయుడు, మన రాజన్న అడుగుజాడల్లో నడుస్తూ పోతున్న మన మల్ల రవి కుమార్. పార్టీ ఉన్నంత వరకు కాదు.నా ప్రాణం ఉన్నంత వరకు మన రాజన్న డా''సిదిరి అప్పలరాజు కి సైనికుడిలా ఉంటానంటున్న మల్ల రవి కుమార్ (నియోజకవర్గ జనరల్ సెక్రటరీ). మల్ల రవి కుమార్(యం.ఆర్) ఆ పేరు చెప్తే యువతలో ఒక ప్రత్యేకమైన ఉత్సాహం, యం.ఆర్ అంటే యువతకు ఒక బలం,తను ఏ ప్రాంతం, ఏ వార్డ్ కి వెళ్ళిన తనదంటూ ఒక శైలి ప్రదర్శిస్తున్నా మల్ల రవి కుమార్. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాలు మేరకు మల్ల రవి కుమార్ (యం.ఆర్ ) కోసం సైనికులుల పని చేస్తున్న మన పలాస నియోజకవర్గా యువత. పలాస - కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల పదో తేదీ అనగా బుధవారం నాడు జరిగిన పలాస - కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల్లో మన రాజన్న డా సీదిరి అప్పలరాజు బలపరిచిన అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మేజారిటీతో గెలిపిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పెద్దలకు, మిత్రులకు, నా శ్రేయోభిలాషులకు, మహిళలకు, యువకులకు ప్రతి ఒక్కరికీ పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నాను. నా ప్రాణం ఉన్నంత వరకు ఒక నాయకుడు ల కాకుండా మా అన్న డాక్టర్ సీదిరి అప్పలరాజు గారికి సైనికుడుల ఉంటానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.. ప్రజలు కోసం రాజన్న.. రాజన్న కోసం రవన్న..

## సమయం

### 'అభ్యుదయ కిరణం - గురువు'

మనిషిని ఆదివాసి నుండి
అనంత లోకాలపై ఆధిపత్యానికి
సోపానాలు వేస్తూ
మానవ మేథోసంపత్తును
ఉన్నత శిఖరాలకు చేరుస్తున్న
ఒక వెలుగు కిరణం... గురువు
'విద్య ఒక తపస్సు
జీవితానికి అది... ఓ ఉషస్సు'
అన్న సూక్తిని నిజం చేస్తూ
అనుక్షణం శోధిస్తూ...
అనునిత్యం బోధిస్తూ...
విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి
శిష్యోన్నతే గురుదక్షిణగా భావించి
దిశ నిర్ధేశనంలో దిక్సూచియైన
దైవ స్వరూపుడు
మా గురువర్యులు

...కవితా రచన
ఆర్.శంకర్

## పంచాంగం

మాసం : మాఘ ; తిథి : చతుర్ధశి మ.2.44; శతభిషం రా.10.31; వ.ఉ.6.50 వరకు ; వ.తె.5.13ల

శుక్రవారం 12-03-2021

a **మేషం** : ఆంతరంగిక సమస్యలకు పరిష్కార మార్గం కానవస్తుంది. ముఖ్యుల రాకలు పెరుగుతాయి. ఆటోమొబైల్, ట్రాన్సుపోర్టు, మెకానికల్ రంగాలలోని వారికి చికాకులు తప్పవు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

b **వృషభం** : బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. ఉద్యోగస్తులకు స్థానమార్పిడి, కొత్త బాధ్యతలు చేపట్టే ఆస్కారం ఉంది. రాజకీయ నాయకులు తరచు సభా సమావేశాలలో పాల్గొంటారు. బంధుమిత్రలతో పట్టింపులు ఎదుర్కొంటారు. ఉమ్మడి వ్యాపారం సౌమ్యంగా సాగుతుంది.

c **మిథునం** :మీ పాత సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురవుతారు. కష్ట సమయంలో సన్నిహితులకు అండగా నిలుస్తారు. సోదరులతో సత్సంబంధాలు నెలకొంటాయి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆర్థిక విషయాలలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ముఖ్యుల సహకారం వలన సమసిపోతాయి.

d **కర్కాటకం** : కళాకారులకు రచయితలకు, పత్రికా రంగంలోని వారికి పురోభివృద్ధి కానరాగలదు. అలౌకిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు తప్పవు. వస్త్ర, బంగారు, వెండి రంగాలలోని వారికి సంతృప్తి కానవస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది.

e **సింహం** : ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి చికాకులు తప్పవు. శ్రమాధిక్యత వల్ల అస్వస్థతకు లోనవుతారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగాలలోని వారికి అనుకూలమైన కాలం. ఉపాధ్యాయులకు ఒత్తిడి పెరుగుతుంది. స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరికొంత కాలం వాయిదా వేయడం మంచిది.

f **కన్య** : నూతన దంపతులకు కొత్తకొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. స్థిరాస్తి క్రయవిక్రయాలకు సంబంధించిన వ్యవహారాలలో మెళకువ అవసరం. దైవ కార్య క్రమాల పట్ల ఏకాగ్రత వహిస్తారు. ప్రత్యర్థులతో రాజీ కుదురుతుంది. న్యాయవాదులు చికాకులు ఎదుర్కొంటారు. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

g **తుల** : కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో చికాకులు తప్పవు. ధనం నిల్వ చేయాలనే మీ ఆలోచన ఫలించదు. ఉద్యోగస్తులకు బాధ్యతలు అధికం అవ్వడంతోపాటు, ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. ఆపద సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. శత్రువులు మిత్రులుగా మారుతారు.

h **వృశ్చికం** : స్త్రీలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించండి. బంధువుల రాక వల్ల మీ కార్యక్రమాల్లో అంతరాయం ఏర్పడుతుంది. వస్త్ర, బంగారు, వెండి వ్యాపారస్తులకు లాభదాయకంగా ఉంటుంది. మీరు చేసే కృషి వల్ల మీ ప్రతిభ వెలుగులోకి వచ్చి మంచి విజయం సాధిస్తారు. నిరుద్యోగులకు ఆశాజనకం.

i **ధనుస్సు** : చిన్నతరహా పరిశ్రమలలోని వారికి వృత్తులలోని వారికి సంతృప్తి కానవస్తుంది. మధ్యవర్తిత్వం వహించుటవల్ల మాటపడతారు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. భాగస్వాముల మధ్య మనస్పర్థలు తలెత్తినా సమసిపోగలవు. కమ్యూనికేషన్స్, ఏజెన్సీ రంగాలలో వారికి సంతృప్తి కానవస్తుంది.

j **మకరం** :పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులే అనుకూలిస్తాయి. ప్రేమికులు ప్రతి విషయంలోనూ మితంగా వ్యవహరించడం క్షేమదాయకం. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం మంచిది. రాజకీయాలలోని వారు ప్రత్యర్థులు పెరుగుతున్నారని గమనించండి. నిర్మాణ పథకాలలో చురుకుగా పాల్గొంటారు.

k **కుంభం** : ప్రింటింగ్ రంగాల వారికి శ్రమించిన కొలదీ ఆదాయం అన్నట్లుగా ఉంటుంది. ప్రయాణాల్లోను, వాహనం నడుపుతున్నపుడు మెళకువ వహించండి. ఇంటా బయటా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటారు. ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. మీ సంతానం వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది.

L **మీనం** : మీరు తలపెట్టిన పనిలో ప్రోత్సాహం లభిస్తుంది. పత్రికా రంగంలో వారికి పురోభివృద్ధి కానవస్తుంది. సోదరీ, సోదరుల మధ్య అవగాహన కుదరదు. స్త్రీలకు తల, కళ్లు, నరాలకు సంబంధించిన చికాకులను ఎదుర్కొంటారు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి ప్రశంసలు అందుతాయి. మీ శ్రీమతి ఇచ్చిన సలహా పాటించడం మంచిది.

## భక్తి వాఙ్మయంలో భజగోవిందం

## సంకీర్తన



క్షణక్షణం మానవ జాతి యావత్తు అశాంతితో కొట్టుమిట్టాడు తోంది. స్వార్థము, మోహము, తృష్ణ, డంభములతో నడిచే మానవ జాతికి సత్సాంగత్యము, భగవద్భక్తి మొదలైన ఆర్షధర్మములే ప్రశాంతిని చేకూర్చగలవు. శంకర భగవత్పాదులు అందించిన భజగోవింద స్తుతి భక్తివాఙ్మయములో అద్వితీయ మైనది. ధార్మిక ప్రబోధము, విష్ణుభక్తి ప్రేరకముఅగు ఈ స్తుతికిగల భక్తిప్రచారము అనన్యసామాన్యము. దీనికి మోహముద్గరమని నామాంతరము కలదు. ఈ స్తుతి పండితులనుండి పామరుల వరకూ జీవన సత్యాన్ని బోధిస్తుంది. దీనిని పఠించుటవలన, అందలి సారాన్ని కొంతలోకొంతైనా ఆచరించిన జన్మ ధన్యత నొందగలదు. ఈ స్తుతి ఛందములోను, పద్య శిల్పము లోను, భావగౌరవములోను పదముల పొందికలోను అత్యంత రమణీయమైనది. శంకర భగవత్పాదులు అపర శంకరా వతారం కారణజన్ములు. 32 సంవత్సరములే జీవించినా శంకరులు ఆనాటి సాంఘీక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతులను సమూలాగ్రంగా సమీక్షించి, భారత జాతిని ఒక్క త్రాటిపై తెచ్చిన ఘనత వీరికే చెందుతుంది. హిందూ మతస్థులందరికీ, అన్ని శాఖలవారికి అనువుగా స్తోత్రరాజాలను రచించిన ఘనత ప్రప్రథమంగా శంకరులకే చెందుతుంది. మూడు పర్యాయములు భారతదేశ సంపూర్ణ యాత్రచేసి అద్వైత తత్వాన్ని ప్రతిపాదించిన మహనీయులు శంకర భగవత్పాదులు. నాలుగు చెరగులా నాలుగు శంకరాచార్య పీఠాలను స్థాపించి ఆధ్యాత్మిక ప్రతిపత్తి కల్పించిన పరివ్రాజకుడు శ్రీ శంకర భగవత్పాదులు. ఒక విధంగా భారతీయ జీవన విధానాన్ని దిశానిర్దేశనం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ శంకర భగవత్పాదులు. అసలు భజగోవింద స్తుతి రచించటానికి ఒక వృద్ధుడు కారణభూతుడు. వ్యాకరణ పాఠాన్ని వల్లెవేయటంవలన ప్రయోజనం లేదని గోవిందుని భజించుటయే ముఖ్యమని, అదే మానవ జన్మకు తరుణోపాయమన్ని భజగోవింద స్తుతిని అందించారు శంకర భగవత్పాదులు. మొదటి శ్లోకంలో భజగోవింద మూడుసార్లు అనటంలో పునరుక్తి దోషములేదనుట భాషాకోవిదుల అభిప్రాయం. విషయము అర్థమైన రీతిలో నివేదిం చటంలో ఔచిత్యమున్నది. మొదటిసారి దీక్షాగురువులు గోవింద పాదులవారిని స్మరించటం, రెండవసారి శ్రీమన్నారాయణు ని మూడవసారి తత్వభూతమైన స్వరూపాన్ని స్మరించారని వ్యాఖ్యానకారుల అభిప్రాయం. ఇక శ్లోకాల విషయానికి వస్తే అత్యాశలేని జీవితం. ఉన్నదానిలో సంతృప్తి చెందటం (మూఢ జహిహిధనాగమతృష్ణా), మోహాన్ని వదలి మానవీయంగా బ్రతుకుట నేర్చుకోవాలి (నారిస్త్యన భరనాభిదేశం), స్వజనులు వ్యవహరించేరీతి. మరణ సమయంలో భార్యాపిల్లలు భీతి చెందుట (యావత్పదనో నిరసతిదేహీ) వివరిస్తారు. అలాగే యదార్థతత్వాన్ని చింతన చేయాలి (కాతేకాన్తాకస్తే పుత్రః), నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం, జీవనముక్తి హేతువు (సత్సంగత్వే నిస్సంగత్వం)గా స్వీకరిస్తూ ధనవన గర్వాన్ని వీడి శాశ్వతతత్వాన్ని పొందే ప్రయత్నం చేయాలి. (మాకురువన గర్వ) సజ్జన సాంగత్యంతోనే జన్మతరిస్తుంది (కాతేకాన్తానగత చింతా), బహుకృత వేషాలతో జీవిత వలయంలో చిక్కుకొని సత్యదర్శనాన్ని పొందటంలేదు. (జటిలో ముండిలుంచితకేశః) అంతేగాదు జ్ఞానవిహీనునికి గంగాసాగర గమనం ముక్తినందించదని (కురుతే గంగాసాగర గమనం) సర్వసంగ పరిత్యాగికి సుఖానుభూతి సులభతరమని (యోగరతోవా భోగరతోవా), నేనెవరినని ప్రశ్నించుకుంటే సంసార స్వప్నతుల్యమని (కస్త్వంకో అహంకుత ఆయాతః) బోధపడుతుంది. సమచిత్తుడవైతేనే పరమాత్మను పొందగలవు. (త్వయిమయిచ అన్యత్రైకోవిష్ణుః), సమత్వభావన అలవరచుకుంటే (శత్రేమిత్రౌపుత్రౌ బంన్ధ్), సో అహం తత్వాన్ని గ్రహించగలవు. (కామక్రోధంలోభం మోహం). అలాగే ధనార్జనవల్ల శుఖము కలుగదు (అర్థమనర్థం భారయ నిత్యం). చివరగా ప్రాణాయామం, జపతపాదుల వలన సత్యతత్వం బోధ పడుతుంది.

(ప్రాణాయామం ప్రత్యాహారం). గురువు నాశ్రయించిన వానికి పరమాత్మ దర్శనం సులభతరవౌతుంది. ఎటొచ్చి వాటిని ఆచర ణాత్మకం చేసినపుడే వ్యక్తి సంస్కారవంతుడు కాగలడు. ఇటువంటి జీవన సత్యగుళికలని మనిషి పుట్టుకనుండి మరణం వరకు అన్ని ఇతివృత్తాలని తత్వవిచారంగా 32 ఏళ్ళ వయస్సులో రచించటం శంకర భగవద్పాదులు, అవతార పురుషులని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ శ్లోకాలను పఠించాలి, అందలి మూలార్థాన్ని స్వీకరించి మానవ జన్మను సార్థకత చేసుకోవాలి. శంకరాచార్య రచించిన కనకధారా స్తవము, సౌందర్య లహరి ఇత్యాది రచనలు దైనం దినంగా దీక్షాతత్పరులుగా పఠిస్తే సర్వకార్యసిద్ధి లభించుటయే గాక, మానసిక ప్రశాంతత సిద్ధించగలదు.

# చోడవరంలో భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

## - హరనామ స్మరణతో మారుమ్రోగిన శివాలయాలు



వెంకన్నపాలెం లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైసీపీ నాయకులు శరగడం సిమ్మి నాయుడు, వెంకన్నపాలెం సర్పంచ్ ఎం. ఈశ్వరరావు



పూజలందుకుంటున్న చోడవరం స్వయంభు గౌరీశ్వర స్వామి



వెంకన్నపాలెం కాశీ విశ్వేశ్వర స్వామి కి పూజలు చేస్తున్న భక్తులు

చోడవరం : చోడవరం పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయంతో పాటు, వెంకన్నపాలెం, రాయప రాజుపేట, గవరవరం కాశీ విశ్వేశ్వర ఆలయం, జుత్తాడ, గోవాడ, గౌరీపట్నం, లక్కవరం శివాల యాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివలింగాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుండి భక్తులు తరలివచ్చి శివ లింగాలకు అభిషేకాన్ని నిర్వహించారు. చోడవరం స్వయం భు గౌరీశ్వర ఆలయంలో ఎమ్మెల్యే సోదరుడు జయదేవ్, ఉత్సవ కమిటీ చైర్మన్ గూనురు సత్యనారాయణ స్థానిక ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. గోవాడ లో వైసిపి సీనియర్ నాయకులు ఏడువాక సత్యారావు, భక్తులు శివలింగానికి అభిషేకం, పూజలు నిర్వహించారు. వెంకన్నపాలెం కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామివారికి వేద పండితులచే సహస్ర అభిషేకం, హోమ పూజ, లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు భారీ అన్నసమారాధన చేపట్టారు. ఆలయ నిర్వాహకులు, రేజేటి నరసింహాచార్యులు, ఆశ్రమ అధ్యక్షులు జుత్తాడ సోమేశ్వరరావు, ఉపాధ్యక్షులు దేవరపల్లి చంటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శరగడం సిమ్మి నాయుడు, వెంకన్నపాలెం పాలెం , దుడ్డుపాలెం సర్పంచ్ లు మొలి ఈశ్వరరావు, కూర్మదాసు మాలిబాబు, సూరి లక్ష్మి, గోవాడ టిడిపి నాయకులు ఏడువాక లక్ష్మణ్ కుమార్, వెంకన్నపాలెం మాజీ ఉప సర్పంచ్ కేదారి శెట్టి గుప్త, కోటవీధి టిడిపి నాయకులు ముడుసు గోవింద, ఇందు, ఆర్ఆర్ సేవ సంఘం నిర్వాహకులు కుప్పిలి అప్పలస్వామి, విశ్వ హిందు పరిషత్ జిల్లా కార్యదర్శి సత్య నారాయణ, ఆడారి సోమేశ్వర రావు, ఆడారి కోటి ఆది బాబు, ముచ్చు పల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మారుమ్రోగిన ధారమఠం

## భక్తులతో కిటకిటలాడిన దారమల్లేశ్వరస్వామి ఆలయం



దారమఠం వద్ద సిఐ శ్రీనివాసరావు





ధారమఠం వద్ద భక్తుల సందడి

గొలుగొండ : మహాశివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో దారమఠం ప్రాంతం మారుమ్రోగి పోయింది. గురువారం గొలుగొండ మండలం దారమఠం శ్రీశ్రీశ్రీ ఉమాదారమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. నర్సీపట్నం రూరల్ సిఐ శ్రీనివాసరావు, గొలుగొండ ఎస్సై ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ వాహనాలు తప్ప ఇతర ప్రైవేటు వాహనాలు ఎక్కడ కూడా రాకుండా నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఆలయ సిబ్బంది కొన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో వెంకట్రాది తెలిపారు.

## ఈ నెల 14న యూపీఎస్సి లాంజ్ లో ఫ్రీ స్కాలర్‌షిప్ టెస్ట్




విశాఖపట్నం : ఐఏఎస్, ఐపీఎస్ గ్రూప్ వన్, ఇతర పోటీ పరీక్షలలో చదువుకునే విద్యా ర్థులకు అత్యుత్తమ శిక్షణను అంది స్తున్నా ఢిల్లీకి చెందిన యూపీఎస్సి లాంజ్ విశాఖ బ్రాంచ్ విద్యా ర్థులకు ఫ్రీ మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు యూపీఎస్సి లాంజ్ విశాఖ బ్రాంచ్ ఇంచార్జ్ రంజిత్ షా తెలిపారు. ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి ఈ పరీక్షలు నిర్వ హిస్తున్నట్లు రంజిత్ షా ఆశీల మెట్ట వద్దగల బ్రాంచ్ కార్యా లయంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ పోటీ పరీక్షలకు డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థుల తో పాటుగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులేనని తెలిపారు. ఉచితంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలలో మొట్ట మొదట మూడు స్థానాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 100% కోచింగ్ ఫీజులో రాయితీ ఉంటుందని తెలిపారు. టాప్ టెన్ విద్యార్థులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పోటీ పరీక్షలలో హాజ రైన ప్రతి విద్యార్థికి ఫీజులో 10% రాయితీ ఉంటుందన్నారు. ఢిల్లీ వెళ్లి చదువు కొనే స్థోమత లేని విద్యార్థులు ఈ సదవకాశాన్ని విని యోగించుకోవాలని కోరారు. పరీక్షలో హాజరుకానున్న విద్యార్థులు 8712828301 ఈ నంబర్ కి కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని కోరారు.

## మత్స్య గుండం ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు





పాడేరు : హుకుంపేట మండలం మత్స్య గుండం ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి డా.సలిజాముల వెంకటేశ్వర్ పట్టు వస్త్రాలు ధరించి ఆల యాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆయన కమిటీ సభ్యులతో మాట్లాడుతూ దూర ప్రాంతాలనుంచి దర్శనానికి వచ్చిన భక్తు లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడా లని మంచినీరు సరఫరా చేయాలని నీటిలో దిగి స్నానాలు చేసేవారిని నిత్యం పర్యవేక్షించాలని గజ ఈత గాళ్లను అందు బాటులో ఉంచు కోవాలని విద్యుత్ కు అంత రాయం కలుగకుండా చూసుకోవాలని పిఓ ఆదేశించారు. గురువారం నుండి 3రోజులు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

## శివరాత్రి సందర్భంగా భక్తులతో కిట కిటలాడిన ఆలయాలు




భీమునిపట్నం : మహాశివరాత్రి సందర్భంగా గురువారం భీమునిపట్నం, తగరపువలస లోని శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ఉదయం 5 గంటల నుండే భక్తులు శివ దర్శనానికి వేచి క్యూలైన్ లో ఉన్నారు. శివుడుకి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

## పల్స్ షాట్స్‌లో అద్భుత రుచి

విశాఖపట్నం: డీఎస్ గ్రూప్ ఆధ్వర్యంలోని దేశంలోనే అత్యంత ప్రముఖ పల్స్ క్యాండీ ఇప్పుడు చిన్న గుండ్రటి బైట్ సైజ్ ఫ్లేవర్ బాంబ్స్ స్థాయిలో 'పల్స్ షాట్స్' అనే పేరుతో లభిస్తోంది పచ్చి మామిడి కాయ రుచితో మధ్యలో ఒక పుల్లటి రుచి కలిగి బైట్ సైజ్ క్యాండీగా రూపొందాయి. సృజనాత్మక రుచులని ఆస్వాదించడానికి ఆసక్తి చూపే వినియోగదారులకు ఈ పల్స్ షాట్స్ అందుబాటులోకి వచ్చాయి. సుమారుగా 910 పల్స్ షాట్స్ తో 17 గ్రాముల పౌచ్ ధర రూ.5 మాత్రమే. అందుకే, ఇది స్నేహితులతో, కుటుంబ సభ్యులతో పంచుకోవడానికి ఉత్తతమైనది. పాస్ పాస్ పల్స్ అనేది డీఎస్ గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలోని క్యాండీ. ఇది 2015లో విడుదల కాగ, గత మూడేళ్లలో భారత దేశంలో క్యాండీ మార్కెట్ లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ. పల్స్ ఐదు రుచుల్లో పచ్చి మామిడికాయ, జామ కాయ, కమలా పండు, పైన్ యాపిల్, లిచీ రుచుల్లో లభిస్తుంది.

## ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో అందాలి

సీతంపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి కాంచీలాల్ దండే అన్నారు. సీతంపేట ఐటీడీఏను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

అమ్మ-ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన వంటి పథకాలు విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిం చాలని, పాఠశాలలకు అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా ర్థుల ఆరో గ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇంటింటికీ రేషన్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. అనాస, పసుపు ఉత్ప త్తులను మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆడలి వ్యూ పాయింట్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.

## దారమఠంలో పర్యటించిన దేవదాయ శాఖ కమిషనర్ శాంతి



మాట్లాడుతున్న దేవాదాయశాఖ కమిషనర్ శాంతి

గొలుగొండ : దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అదనపు కమిషనర్ శాంతి గురువారం గొలుగొండ మండలం దారమఠంలో పర్యటించి ఉమాధార మల్లేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రేషన్ నిల్వకు 20 కొత్త కేంద్రాలు : జేసీ

### ఉప కలెక్టర్, పౌరసరఫరాల డీఎంతో సమీక్షిస్తున్న జేసీ కిశోర్ కుమార్



సాలూరు : రేషన్ సరకులు నిల్వ చేసేందుకు సాలూరు, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో 20 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జేసీ కిశోర్‌కుమార్ తెలిపారు. పుర కార్యాలయంలో ఉప కలెక్టర్ విధేహ్‌ఖరె, పౌర సరఫరాల డీఎం భాస్కరరావు, తహసీల్దార్‌తో సమీక్షించారు. గిరిశిఖర గ్రామాలు, ఎండీయూ వాహనాలు వెళ్ల లేని గ్రామాల్లో లబ్ధిదారులకు సరకులు సకాలంలో అందించేందుకు స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి నట్లు చెప్పారు. దీని కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని జేసీ తెలిపారు.

**12 వరకు సరకుల పంపిణీ**

ఫిబ్రవరి నెల రేషన్ పంపిణీని మరో రెండు రోజులు పొడిగిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ (రెవెన్యూ) జీసీ కిశోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

లబ్ధిదారుల విజ్ఞప్తి మేరకు.. ఎండీయూ వాహనాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ నెల 12వ తేదీ వరకు సరకులను పంపిణీ చేయ నున్నామని పేర్కొన్నారు.

## 15 వరకు ఉచితంగా కిడ్నీ పరీక్షలు

శ్రీకాకుళం : ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు కిడ్నీకి సంబంధించి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి శ్రీకాకుళంశాఖ అధిపతి డాక్టర్ పి.సాగరిక బుధవారం తెలిపారు. ఆయాసం, ఆకలి మందగించడం, మూత్రం తగ్గడం, రంగుమారడం, రక్తహీనతతో బాధపడటం, పక్కటెముకల కిందభాగంలో నొప్పి, నడుమునొప్పి, రాత్రిపూట మూత్ర విసర్జన ఎక్కువసార్లు జరగడం, తదితర లక్షణాలతో బాధపడేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



## శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు

మాకవరపాలెం : మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రిని పురస్కరించు కొని గురువారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గిడుతూరులో గంగాదేవేశ్వరస్వామి, పిపి.అగ్రహారంలో అమృతేశ్వర స్వామి ఆలయం, మాకవరపాలెం వేమలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. అదే విధంగా గురువారం రాత్రి రుద్రాభి షేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

## మణిభూషణ్ దర్శకత్వం లో

# 'నిక్ర' వ్యవసాయ చిత్రం పూర్తి




విశాఖపట్నం : నగరానికి చెందిన ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ రబ్ గ్రూప్ ఇండియా వారి సమర్పణలో, ప్రముఖ దర్శకుడు జాతీయ అవార్డు గ్రహీత మణి భూషణ్ దర్శకత్వం లో కృషి విజ్ఞాన కేంద్రం, ఆముదాల వలస వారి నిర్మాణ సారధ్యం లో మొదలైన 'నిక్ర' పధకం వరద ముంపు ప్రాంత వ్యవసాయ పద్ధతులు అవగాహన చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకున్న సందర్భంగా దర్శకుడు మణి భూషణ్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా హీరమండలం కొత్తూరు దగ్గర వంశధార నది తీరం లో ఎప్పటికప్పుడు వరద ముంపు గురై , రైతుల జీవితాల్లో కష్టాలను నింపిన ప్రాంతం సిరుసు వాడ గ్రామం. అక్కడ కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస వారు నూతన విజ్ఞాన పద్ధతితో నిక్ర అనే పదకంలో బాగంగా ఆ గ్రామాన్ని దత్తత తీసుకొని - ప్రతిసారి వచ్చే వరదలకు ముంపు గురై వేల ఎకరాల పంటలు నాశనం అవుతున్న క్రమంలో నూతన పద్ధతులను రైతులకు తెలియపరచి, వాటిపట్ల సమగ్ర అవగాహన కల్పించి, పాడైన చెరువులను బాగు చేసి, వర్షాలు లేని సమయంలో వ్యవసాయం చేసుకునే సరైన నీటి యాజమాన్యం పద్ధతులు నేర్చి - ఖరీఫ్ లో వారి మరియు రబీ సమయాల్లో కూరగాయలు, పండ్లు, గొర్రెల పెంపకాలను ప్రోత్సహించి గ్రామ రైతులలో ఎన లేని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారికి ఆర్ధిక భరోసా కల్పిస్తూ, విజయ పదం వైపు దూసుకుపోతున్న సిరుసువాడ విజయగాధను - నిక్ర అనే పేరు తో డాక్యుమెంటరీ గా రూపొందిస్తున్నట్టు , ఇతర రైతులకు దిశా నిర్దేసిన్చే విదంగా రమణీయ ప్రకృతి లో ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని త్వరలో రిలీస్ కు సిద్ధం చేస్తున్నామని ఈ పథకం పై సమాచారం కోసం 9848418582 కు సంప్రదించవచ్చు అని దర్శకుడు మణి భూషణ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నం నాయుడు, ప్రోగ్రామ్ ఇంచార్జీ అమరజ్యోతి, రైతులు రాములు, వెంకట రావు, హీరో ఆదిత్య, సీఈఓ సీతారామ స్వామి,ఎడిటర్ నీరజ, కెమెరా యోగేష్, వేణు, కిషోర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పీఎంపీచే ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలు



కాకినాడ : ప్రపంచ కిడ్నీ దినోత్సవ వేడుకలు ది.పీఎంపీ అసోసియేషన్ కాకినాడ సిటీ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మౌర్య ఆస్పటల్ అధినేత డాక్టర్ పుల్ల ప్రసాద్‌ను కలసి కిడ్నీ డే శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.ఈ కార్య క్రమంలో సిటీ అధ్యక్షులు కె.తాతారావు ఉపా ధ్యక్షులు శ్రీనివాస రావు సహాయ కార్యదర్శి ఎస్.వి.రామారావు సిహెచ్ శాస్త్రి పి.వీరభద్రరావు, జగన్ ,డివిఎస్ సాయి, శర్మ, కె.ఎస్.ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వేసవికాలంలో కిడ్నీ సంరక్షణ మంచి మంచి నీరు త్రాగడం వలసిన ఆవశ్యకత జాగ్రత్తలు గురించి వివరించారు. అధ్యక్షులు తాతారావు, ఇతర పీఎంపీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రహ్మశ్రీ శివరామకృష్ణ ఘనపాఠీ

# స్వర్ణ కంకణ ధారణ సన్మానం



విశాఖపట్నం : ద్వారకానగర్ శంకరమఠంలో మహాశివరాత్రి పర్వదినాన శుభ తరుణంలో తిరుమల తిరుపతి దేవస్థానముల లో శ్రీ కృష్ణ యజుర్వేద పండితునిగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్న తిరుపతి నగరానికి చెందిన బ్రహ్మశ్రీ ముష్టి శివరామకృష్ణ ఘనపాఠీ కి ఘనంగా మంగళధ్వని వేదమంత్రములు మధ్య స్వర్ణ కంకణ ధారణ సన్మాన మహోత్సవం జరిగింది సీనియర్ న్యాయవాది శంకరమఠం అధ్యక్షులు లంక జగన్నాథం కార్యక్రమము ప్రారంభించగా బ్రహ్మశ్రీ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి సభాధ్యక్షులుగా వ్యవహరించి శివరామకృష్ణ ఘనపాఠీ శ్రీ కృష్ణ యజుర్వేద పండితునిగా వేదోక్తముగా చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను ప్రశంసించారు. విశిష్ట అతిథులుగా బి.మల్లికార్జునరావు, డాక్టర్ పివి.రమణమూర్తి, గౌరవ అతిథిగా శంకర్ మఠం కార్యదర్శి పి.ఎస్.కుమార్, ఏ.శ్రీనివాసమూర్తులు హాజరయ్యారు. సన్మాన గ్రహీత బ్రహ్మశ్రీ శివరామకృష్ణ మాట్లాడుతూ ఇంతమంది వేదమూర్తులు సమక్షంలో నాకు స్వర్ణ కంకణధారణ జరగటం దైవానుగ్రహమని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు వేదమంత్రాలతో నిర్వహించిన ఆధ్యాత్మిక సభకు ఎం.వెంకటేశ్వర ఘనపాఠీ స్వాగత ఉపన్యాసం చేయగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త యమ్.వి.రాజశేఖర్ వందన సమర్పణ చేశారు. సభానంతరం నమక చమకముల ఘనస్వస్తి పలికి లింగోద్భవకాలమున పరమేశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు నివేదన నీరాజన మంత్ర పుష్పము సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం వెంకటేశ్వర ఘనపాఠీ ఎం భీమశంకర శాస్త్రి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు వేద పండితులు వివిధ దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు.

# టైకీ ఇండస్ట్రీలో ప్రమాదం

## ఇద్దరు కార్మికుల మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు



కాకినాడ రూరల్ : సర్పవరం గ్రామం ఆటోనగర్ సమీపంలో ఉన్న టైకీ ఇండస్ట్రీస్ కెమికల్ కంపెనీలో గురువారం మధ్యాహ్నం ప్రమాదం చోటుచేసుకుని ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇక్కడ కంపెనీలో ఎన్నో సంవత్సరాలుగా మాత్రలు తయారు చేస్తున్నారు.కంపెనీ వీటిని దేశీయంగానే కాకుండా విదేశాలకు ఎగుమతి చేస్తోంది.ఇక్కడ మూడు షిఫ్టులలో వందలాది కార్మికులు పనిచేస్తున్నారు.గురువారం మధ్యాహ్నం సమయంలో ఓ బాయిలర్‌లోని ఎయిర్ గ్యాస్ లీకైన ఘటనలో బిల్డింగ్ పైన చుట్టూ ఉన్న గోడ పగిలి రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో కంపెనీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని హాస్పిటలుకు తరలించారు. ప్రమాదంలో కాకినాడకు చెందిన ఇద్దరు కార్మికులు కె.సుబ్రహ్మణ్యం, టి. రమణ అక్కడికక్కడే మృతిచెందారు. ఘటనా స్థలానికి రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ,పర్యావరణ ఈఈ రామారావు నాయుడు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ బి.శ్రీనివాసరావు, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తదితరులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు సహాయక చర్యలను చేపట్టారు. సర్పవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉక్కు ఉద్యమంలో ప్రత్యక్షంగా భాగస్వాములు కండి

- మోడీపై ఒత్తిడి తీసుకురండి - రాష్ట్ర మంత్రిని కోరిన సీపీఐ జిల్లా బృందం
- ప్రైవేటీకరణను అడ్డుకుందాం మంత్రి కన్నబాబు



కాకినాడ : విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రత్యక్షంగా వైఎస్సార్‌సీపీ భాగస్వాములు కావాలని మీరందరూ నరేంద్ర మోడీపై ఒత్తిడితెస్తేనే ప్రైవేటీకరణ ఆగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు రాష్ట్ర మంత్రి వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబును కోరారు.సిపిఐ జిల్లా బృందం మంత్రి నివాసంలో విజ్ఞాపన అందజేస్తూ జిల్లాలో కార్మిక సంఘాల నాయకత్వంలో ఏర్పడిన విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కార్యక్రమాలను వివరించింది.ఈ సందర్భంగా మంత్రి కన్నబాబు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ చేయడంపై ఇప్పటికే ముఖ్యమంత్రి లెటర్ రాసారని కార్మికసంఘాలు కలుపుకుని ఢిల్లీకి తీసుకుని వెళతామని అన్నారు.సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ విశాఖ ఉక్కు వాటాలను 100శాతం అమ్ముతామని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లోక్ సభలో ప్రకటించడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకై కార్మిక వర్గం ప్రజానికం పెద్ద ఎత్తున పోరాటాలు జరుగుతున్న వాటిని బిజెపి పెడచెవిన పెట్టడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఈ ఉద్యమాన్ని పెద్ద ఎత్తున చేస్తామని రహదారుల దిగ్బంధం,ఛలో పార్లమెంట్ తదితర కార్యక్రమానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలన్నారు. అవసరమైతే అన్ని రాజకీయ పార్టీల శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు రాజీనామా చేసి ఐదు కోట్ల ప్రజల ఆకాంక్ష విశాఖ ఉక్కు సాధించుకోవాలన్నారు.ఈ బృందంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నక్కా కిషోర్, జి.లోవ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయంలో విశేష పూజలు



ఉంగుటూరు : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఉంగుటూరు స్థానిక భద్రకాళి అమ్మవారు దేవాలయంలో విశేష పూజలు జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుండి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు రావడంతో స్థానికంగా సందడి వాతావరణం నెల్కొంది. సంధర్భంగా ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు భక్తులకు ధర్శనమిచ్చారు. 2019 సంవత్సరంలో డా. పాతూరి విష్ణుప్రియరావు, ఉషాబాల దంపతులచే నిర్మించబడిన ఈ ఆలయం ఉభయగోదావరి జిల్లా భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతుంది. కోరిన కోరికలు నెరవేర్చే దేవతగా భక్తులలో నమ్మకం పెరగడంతో ఈ మధ్య కాలంలో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శివరాత్రి పూజా క్రతువులో భాగంగా పూర్వపు జిల్లా పంచాయతీ అదికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్, శైలజ దంపతులచే ప్రసాద వితరణ కార్యక్రమం జరపగా ఆలయ ప్రదాన అర్చ కులు ధూళిపాల పవన్ కుమార్ శర్మ



పూజా క్రతువులు నిర్వహించారు. కార్యక్రమంలో భద్రకాళీ సేవాదళం సభ్యులు నారాయణ హనుమంతరావు, వీరాస్వామి, కరోతి శ్రీనివాసరావు, పాతూరి వంశీకృష్ణ, మిళ్ళపాక ప్రసాధ్ తదితరులు పాల్గొన్నారు

# అన్న సమారాధనను ప్రారంభించిన శెట్టి వెంకటరమణ



అనకాపల్లి : అనకాపల్లి మండలం కొండుపాలెం గ్రామంలో ప్రసిద్ధి చెందిన పురాతన శివాలయం వద్ద మహా శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు తెల్లవారు జాము నుంచే ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపిటిసి శెట్టి వెంకట రమణ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధనను చేపట్టారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు వచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ మేరకు శెట్టి వెంకట రమణ మాట్లాడుతూ

గ్రామంలో పురాతన శివాలయంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని తమ సొంత నిధులతో దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నాటిని పనులు పూర్తి చేస్తామన్నారు. ఆలయంలో నిత్య పూజలు జరుపుతూ భక్తులకు పలు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సాయంత్రం ఆలయం వద్ద నిర్వహించిన భజన కార్యక్రమంలో భక్తులు స్వామి వారి గీతాలాపనలో తరించారు.

# పాత కక్షలు, పార్టీ తగాదాలతో దాడి.. పట్టించుకొని పోలీసులు

## న్యాయ పోరాటానికి సిద్ధం... బాధితులు



పాడేరు: మండలంలోని కాడెలి పంచాయతీ వర్తనపల్లి గ్రామంలో పాతకక్షలతో, పార్టీ తగడదలతో డప్పాడి వెంకటరమణ అనే వ్యక్తిపై దాడి ప్రత్యర్థులు బుధ వారం రాత్రి దాడి చేశారు.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇనుప రాడ్లు కర్రలతో దాడి దాడి కి పాల్పడ్డారు. దాడి వెనక పాత కక్షలతో,పార్టీ తగదలతో పాటు రాజకీయ కక్షలు కారణం అంటు స్థానికులు ఆరోపిస్తున్నారు. దాడి వెనక పంచాయతి సర్పంచ్ వనగు బసవన్న దొర హస్తం ఉందని బాధితులు ఆరోపించారు.దాడి చేసిన వారు అదే గ్రామానికి చెందిన వారు. దప్పాడి రవీంద్ర,రామి రాజేంద్ర, సరమండ నాగార్జున, రామి శివ,రామి కంటమ్మ, దప్పాడి మని,సరమండ మత్యకుమారిలు గా బాధితులు తెలిపారు.పాడేరు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసిన బాధితులకు న్యాయం చేయలేదని,గాయపడ్డా వారికి న్యాయం చేయకుండా దాడి చేసిన వారి వైపు స్థానిక పోలీసులు సహకరిస్తున్నారని ఆరోపించారు. బాధితుల కుటుంబం పోలీస్ స్టేషన్ ముందు కాసేపు ధర్నాకు దిగడంతో సిఐ హామీతో వెనుదిరిగారు.బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఎలా జరిగిందని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఒక వ్యక్తిపై రాజకీయ కక్ష పెట్టుకొని దాడి చేయడం దారుణమని ఇటువంటి దారుణలు మానుకోవాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులకు న్యాయం జరిగే వరకు పొరటం చేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు.అధికార అహం కారం ఏజెన్సీ లో కూడా పెరిగిపోతున్నాయని అన్నారు. పోలీసులు లా అండ్ అడర్ అదుపు చేయాలని బాధితులకు న్యాయం చేయా లని ఆమె డిమాండ్ చేశారు. ఈ పరామర్శ లో గోవింద్ మాస్టర్, రాము,టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# చిన్నారులకు శాపం.. ఆటిజం!



మెడ నిలపటం, పాకటం, తప్పటడుగులు, అత్తతాతలు.. పిల్లల ఎదుగుదల క్రమంలో ప్రతిదీ ఒక పండేగ. వీటిలో ఏదైనా తేడా వచ్చినప్పుడు తల్లిదండ్రులు తేలికగానే గుర్తుపడతారు.. వెంటనే దృష్టిసారిస్తారు కూడా. కానీ ఈ గడపలన్నీ దాటి.. ప్రయాణం బాగానే సాగుతోందనుకుంటున్న తరుణంలో కూడా కొన్ని సమస్యలు ఉండొచ్చు. వీటిని గుర్తించటం అంత తేలిక కాదు.

వాటిని పట్టుకోవటానికి కాస్త అవగాహన అవసరం. ఇలాంటి సమస్యల్లో ముఖ్యమైనదీ.. ఇప్పటి వరకూ పాశ్చాత్య దేశాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ... సంపన్న వర్గాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ.. మన దేశం లోనూ, అన్ని వర్గాల్లోనూ ఎక్కువేనని ఇప్పుడిప్పుడే స్పష్టంగా బయటపడుతున్నదీ... ఆటిజం! ఆటిజం భిన్న విభాగాలకు విస్తరించిన ఎదుగుదల సమస్య. దీన్నే పర్వేసి డెవలప్‌మెంటల్ డిసార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కనబడతాయి. కొన్ని అంశాల్లో ఎదుగుదల అస్తవ్యస్త మవుతుంది. ముఖ్యంగా మూడు అంశాలను ప్రత్యే కంగా గమనించొచ్చు.

**ఇతరులతో కలవలేకపోతుండటం:** ఆటిజం పిల్ల లు తోటి పిల్లలతో ఆడుకోవటానికి అంతగా ఇష్ట పడరు. ఒంటరిగా ఆడుకోవటం, ఒంటరిగా గడపటం ఎక్కువ.

**భావవ్యక్తీకరణ లోపం:**

మాటలు రావటం జాప్యం కావచ్చు. వచ్చినా పూర్తిస్థాయిలో ఉండకపోవచ్చు. తమ అవసరాలను తీర్చుకునేందుకు వేలుపట్టుకుని అక్కడి వరకూ తీసుకువెళ్ళటం వంటివి చేస్తుంటారు.

**ప్రవర్తన లోపాలు:**

చేసిందే మళ్లీ మళ్లీ చేస్తుండటం, ఒకపనిని ఎప్పుడు చేసినా తిరిగి అలాగే చెయ్యాలని ప్రయత్నిస్తుం డటం... రోజూ తాము వాడే టాయిలెట్‌నే వాడతామం టారు. రెండోదానిలోకి వెళ్ళనని మొరాయిస్తుంటారు. కొందరు సంతోషం కలిగితే చేతులను కాళ్ళను పైకీ కిందికీ అదేపనిగా ఆడిస్తారు. మరి కొందరు సూదులు, గుండుపిన్నుల వంటి బేక రకం వస్తువు లను సేకరిస్తుంటారు..... ఆటిజం పిల్లల్లో సాధార ణంగా ఈ మూడు లక్షణలూ ఉంటాయి. కొందరిలో ఒకటిరెండు మాత్రమే ఎక్కువగా కనబడినా అన్ని లక్ష ణలూ ఏదో ఒక స్థాయిలో కనబడతాయి. అమెరికా డయాగ్నోస్టిక్ అండ్ స్టాటిస్టికల్ మాన్యువల్‌లో దీన్ని పర్వేసి డెవలప్‌మెంటల్ డిజార్డర్ కింద దీన్ని వర్గీకరించారు. ఈ లక్షణాలు ఆరంభమైన సమయం, తీవ్రత, క్షీణిస్తున్న తీరు తదితర అంశాలను బట్టి దీన్ని ప్రధానంగా 5 రకాలుగా విభజించారు.

**ఆటిస్టిక్ డిజార్డర్:**

ఎక్కువగా కనబడే ఆటిజం సమస్య ఇదే. దీన్ని చైల్డ్‌హుడ్ ఆటిజం అంటారు. ఇది ఆడ పిల్లల్లో కన్నా మగపిల్లల్లో ఎక్కువ. ముున్ముందు వివరంగా చూద్దాం.

**రెట్స్ డిజార్డర్:**

అరుదైన ఈ రకం ఆడపిల్లల్లో ఎక్కువగా కన బడుతుంది. దీని ప్రత్యేకతేమంటే.. పుట్టిన ఏడాది వరకూ పిల్లలు బాగానే ఉంటారుగానీ తర్వాత లక్ష ణాలు కనబడటం మొదలవుతుంది. ఇవి రెండు మూడేళ్ళలోనే వేగంగా తీవ్రమవుతాయి.

అప్పటికి వచ్చిన ఒకటిరెండు మాటలు కూడా తిరిగి వెనక్కి వెళ్లిపోతాయి. ఇది ముదిరే రకం (ప్రొగసి డిజార్డర్) కావటం వల్ల కొంతకాలానికి నాడీ సంబంధ సమస్య లూ ఆరంభమవుతాయి. సరిగా నడుము నిలపలేక పోతుండటం వంటివాటితో మొదలై మెల్లగా ఫిట్స్ కూడా వస్తాయి.


# చిగుళ్ల జబ్బుతో బాధపడుతున్నారా?

**మ**న దేశంలోని చాలామంది లో చిగుళ్ల జబ్బులతో బాధపడే వారు ఎక్కువ. ఈ చిగుళ్ల వ్యా ధులు ముదిరిపోయి, సమస్య పంటి ఎముక వరకూ వ్యాపిస్తే గానీ సాధారణంగా నొప్పి ఉండదు. అందుకే చిగుళ్ల వ్యాధులను గుర్తించడం అంత తేలిగ్గా సాధ్యంకాదు. అవగాహన కూడా తక్కువే. కొన్ని ప్రాథమిక లక్షణాలు ఉన్నప్పుడు చిగుళ్ల వ్యాధి ఉన్నట్లు గుర్తించి దాన్ని సరిచేసుకోవాలి. చిగు ళ్ల వ్యాధిలో రెండు దశలు ఉంటాయి అవి.




**జింజివైటిస్:**

ఈ దశలో చిగుళ్ల జబ్బు తీవ్రత అంతగా ఉండదు. చిగుళ్లు ఎర్రగా వాచి ఉంటాయి. ముట్టుకుంటే జివ్వుమంటాయి. బ్రష్ చేసు కున్నప్పుడు రక్తస్రావం కావచ్చు. అయితే మన దేశంలో సాధారణంగా ఏదో కారణంవల్లగానీ, బ్రష్ చేసుకునే సమయంలో ప్రతి ఐదుగురిల ముగ్గురికి రక్తస్రావం ఉంటుంది. పైగా జింజి వైటిస్‌ల నొప్పి ఉండదు. ఈ కారణాలవల్ల చాలా సందర్భాల్లో ఏళ్ల తరబడి ఈ వ్యాధిని గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. అందువల్ల సాధారణంగా దంతవైద్యులను కలిసినప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది.



**పెరియోడాంటైటిస్:**

ఈ దశలో ఇన్ఫెక్షన్ తీవ్రత ఎక్కువగా ఉండి చిగుళ్లలో పుండ్లు ఏర్పడటం, దంతాలు దూరంగా జరిగిపోవడం, దంతాల మధ్య సందులు పెరగడం జరుగుతాయి. దీంతో శాశ్వత దంతాలు వదులుకావడం, ఊడిపో వడం కూడా జరుగవచ్చు. దంతం ఎముక వరకు వ్యాధి పాకడం వల్ల జింజివైటిస్ అన్న చిన్న సమస్య పెరియోడాంటైటిస్ దశకు చేరుకుంటుంది. కొద్దిపాటి ముందుజాగ్రత్త లతో జింజివైటిస్ దశ, పెరియోడాంటైటిస్ దశలోకి మారకుండా నివారించవచ్చు.

**వ్యాధిని గుర్తించడం (డయాగ్నోజ్) ఇలా:**

**నోటి దుర్వాసన..**

నోటి దుర్వాసన సమస్యను వైద్య పరిభాషల హాలిటోసిస్ అంటారు. దాదాపు 80 శాతానికిపైగా చిగుళ్ల వ్యాధి వల్లనే నటి దుర్వాసన వస్తుంటుంది. కేవలం 20శాతం మందిలో మాత్రమే ఇది అసిడిటీ, సైనసైటిస్, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌వల్ల కావచ్చు. ఇది ఒక సాంఘిక సమస్య. సాధారణంగా దీనివల్ల కుటుంబ సభ్యులే ఎక్కువగా ఇబ్బందిపడ తారు. ఈ సమస్య కనిపించినప్పుడు చిగుళ్ల వ్యాధి ఉందేమనని అనుమానించి తప్పని సరిగా దంతవైద్యులను సంప్రదించాలి. పళ్లు వదులుకావడం అన్న బాహ్య లక్షణంతో, ఒక్కోసారి పళ్లు ఊడిపోవడంతో, ఎక్స్‌రే పరీక్షతో చిగుళ్లపై తీవ్రత ఏ మేరకు ఉందో గుర్తించవచ్చు.

**లక్షణాలు:**

సాధారణంగా చిగుళ్ల వ్యాధులను ఈ కింది లక్షణాలతో గుర్తించవచ్చు.

బ్రష్ చేసినప్పుడు, ఏదైనా గట్టి వస్తువును కొరికినప్పుడు చిగుళ్ల నంచి రక్తం కారడం. నోటిలో ఎక్కువగా లాలాజలం ఊరుతున్నట్లు అనిపించడం. చిగుళ్లు క్రమంగా తగ్గిపోతున్న ట్లుగా అనిపిస్తూ, అద్దంలో చూసుకున్నప్పుడు క్రమంగా దంతాలపై నుంచి చిగురు కిందికి దిగుతున్నట్లుగా అనిపిస్తుంది. చిగుళ్లపై బుడిపెల్లా వచ్చి, అక్కడ చీము పట్టడం. నోటి దుర్వాసన వస్తుండటం.

పళ్లమధ్య సందులు రావడం, దాంతో పంటి మధ్య దూరం పెరిగి తిన్న ఆహార పదార్థాలు అక్కడ ఇరుక్కుపోవడం, అందుకే తిన్న తర్వా తప్రతిసారీ పళ్ల మధ్య సందుల్లో ఆహార పదార్థాలు చేరుతున్నాయనే అంశాన్ని గుర్తిస్తే తప్పనిసరిగా దంతవైత్యులతో పరీక్షలు చేయించుకోవడం అవసరం.

**చికిత్సలు:**

**క్యూరటాజ్...**

చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అన్న ప్రాథమిక దశలో ఉంటే క్యూరటాజ్ అనే చికిత్స అవసరమవుతుంది.

**ఫ్లాప్ చికిత్స...**

చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అనే దశను దాటి పెరియోడాంటైటిస్ అనే దశకు చేరితే దానికి ఫ్లాప్ చికిత్స అవసరమవుతుంది.

**బోన్ గ్రాఫ్టింగ్...**

చిగుళ్ల వ్యాధి వల్ల పంటి ఎముక బలహీనమైపోతే దాన్ని దృఢపరచడానికి బ్రోన్ గ్రాఫ్టింగ్ అనే చికిత్స చేయాల్సి ఉంటుంది.

**నివారణ ఇలా...**

ఈ సమస్యలన్నింటినీ నివారించడానికి రోజు రెండుసార్లు ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్టుతో బ్రష్ చేసుకోవాలి. పళ్ల మధ్యలో బ్రష్ చేరలేని చోట ఉండే పాచిని తొలగించడానికి ఫ్లాసింగ్ (దారం వంటి దానితో పళ్ల మధ్యన ఉండే ప్రాంతంలో శుభ్ర చేయడం) చేసుకోవాలి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు, పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి.

నోటికి అతుక్కుపోయే ఆహారాలు, స్నాక్స్‌ను తక్కువగా తీసుకోవాలి. తందాలకు బలం చేకూర్చే సమతుల పోషకాహారం తీసుకోవాలి. సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను వాడే అలవాటును పూర్తిగా మానేయాలి. పళ్లను శుభ్రం చేయడం అన్నది కేవలం బ్రషింగ్‌వల్ల మాత్రమే సాధ్యంకాదు. అందుకే రోజూ రెండు సార్లు బ్రష్ చేసినప్పటికి, రోజుకు కనీసం ఒకసారి మౌత్‌వాష్‌తో శుభ్రం చేసుకుంటే నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదల అదుపులో ఉంటుంది. టూత్‌బ్రష్ అన్నది మెకానికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడితే, మౌత్‌వాష్ అన్నది కెమికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడుతుంది.

డెంటిస్ట్ సూచించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి ఆర్నెల్లకు ఓసారి ఇంటిలోని కుటుంబ సభ్యులంతా స్కేలింగ్ ప్రక్రియ ద్వారా శుభ్రం చేయించుకోవడం అవసరం. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్‌ఎఫెక్ట్) ఉండవు. పళ్లు అరిగిపోతాయన్నది, దంతాలు వదులైపోతాయ న్నది, పళ్ల మధ్య సందులు వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే.

**గుర్తుంచుకోవాల్సిన అంశం:**

చిగుళ్ల వ్యాధులు వచ్చినవారిని పరిశీలిస్తే చాలామట్టుకు కుటుంబ సభ్యులలో వంశపారంపర్యంగా ఈ వ్యాధి కనిపించే అవకాశాలు ఎక్కువ. కాబట్టి పళ్లు వదులై పడిపోయిన కుటుంబ చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) ఉన్నవారు తప్పనిసరిగా దంతవైద్యు డిని సంప్రదించాలి. అంతేకాదు.. చిన్న వయ సులోనే ఎవరికైనా పళ్లు ఊడిపోతే వారి పిల్లలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు:**

ఐదేళ్లుగా ఎప్పుడూ దంతవైద్యుడిని కలిసి ఏ రకమైన దంత వైద్య చికిత్సను తీసుకోని వారిలో చిగుళ్ల వ్యాధులు ఉండే అవకాశం చాలా ఎక్కువ. కాబట్టి మీరు ఈకోవలోకి వచ్చేవారైతే తప్పనిసరిగా దంతవైద్యుడిని కలవాలి. కేవలం దంత సంబంధమైన సమస్యలు వచ్చినప్పుడే కాకుండా ప్రతి ఆర్నెల్లకు ఓ మారు విధిగా దంతవైద్యుడితో పళ్ల పరీక్షలు చేయించుకోవాలి. ఇంట్లోని కుటుంబ సభ్యులంతా ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించాలి.

**బ్రషింగ్‌లో జాగ్రత్తలు:**

బ్రష్ చేసుకునేందుకు మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌నే వాడండి. కిందివరసలో చిగుళ్లూ, పళ్లూ కలిసే చటు వరకు నిలువుగా బ్రష్ చేసుకోండి. చాలా మృదువుగా బ్రష్ చేసుకోండి. రఫ్‌గా బ్రష్ చేసుకుంటే అది మీ చిగుళ్లకు హాని చేకూర్చవచ్చు. అలాంటప్పుడు అవి త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. చేత్తో చిగుళ్లపై మృదువుగా మసాజ్ చేసినట్లు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపుడుతుంది.

# టెన్షన్ జయించాలంటే ..

ఈ రోజుల్లో పసివాడు మొదలుకొనిపండుముసలి వరకు అందరూ ప్రతిదినం అనేకమార్లు వల్లించే మాట ఇది. ప్రతి దానికీ ఏదో తెలియనిఆందోళన. ఫలితంగా యవ్వన దశలోనేవివిధశారీరక,మానసికరుగ్మతలు.ఆధునిక జీవన విధానంలో సంక్లిష్టత వల్ల ఏర్పడుతున్న దు:స్థితి ఇది. ఒకవైపు సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి, నవ నాగరికత వల్ల ఏర్పాటౌతున్న సుఖభోగాల...ఎన్నిఉన్నాఉద్విగ్నం, బెంగ, దిగులుకొత్త కొత్త తరహాల్లోఎదురౌతున్నాయివీటికి కారణాలేమిటి? పరిష్కారమేమిటి?.. మానసిక స్థైర్యం కొరవడటమే ఈ పరిస్థికి కారణం. నిజానికి దీనికి పరిష్కారం- పూర్తిగా ఆధారపడదగినది - మన పూర్వీకులే మనకు ఇచ్చారు. బాల్యం నుండే పెంచి పోషించుకుంటున్న పోటీ ప్రవృత్తిని ఒకరిని మించి పోవాలనే తాపత్రయం, అన్నిభోగసాధన లు తమకుఅందుబాటులో ఉండాలం ేలాలస... ఈ విధమైన దృక్పథాలవలన అశాంతికి లోనౌతున్నాడు నవీన మానవుడు. ఆధ్యాత్మిక ధార్మిక ఆలోచనారవళినిపెంపొందించు కోవడమే దీనికి పరిష్కారం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా వెంటనే ప్రతికూలం (Negative) గా స్పందించకుండా, ప్రశాంతతని కోల్పోకుండా మసలగలిగే అనుకూల (Positive) ధోరణిని అభ్యాసం చేయాలి.



ఎవరు ఆదర్శం?ఈ మానవలోకానికి 'మిశ్ర' లోకం అని పేరు. సుఖదు:ఖ మిశ్రణమే ఇహలోక వైఖరి. ఈ అనుభవాలకి ఎలా స్పందించాలి?

**దు:ఖేష్వనుద్విగ్నమనా: సుఖేషు విగత స్పృహ:।**
**వీతరాగ భయకోధ: స్థిత నీర్మునిరుచ్యతే ॥**

"దు:ఖంలో మనస్సు ఉద్విగ్నం చెందకుండా, సుఖాలలో అంటుకొని పొంగిపోకుండా, మోహం, క్రోధం, భయం వంటి వికారాలకు లోనుకాకుండా ఉండేవాడే స్థితప్రజ్ఞుడు" అని గీతాచార్యుని మాట జ్ఞాని మన:స్థితి 'సంయమనం' 'సమతుల్యం'గా ఉంటుంది. అలాంటి యోగిని మనం ఆదర్శంగా తీసుకొని పురోగమించిడం సుఖజీవన మార్గం. కానీ మనం అధిక సంపన్నుల్నీ, కీర్తిమంతుల్నీ మనకు 'మోడల్స్' గా ఎంచుకుంటాంగానీ, గొప్ప వ్యక్తిత్వాలను ఆదర్శాలుగా భావించం.పైగా మానసిక దృఢత్వమనేది ఏదో ఆధ్యాత్మిక వాదంగా పరిగణిస్తాం గానీ మానవుని వికాస వ్యక్తిత్వంగా లెక్కించం. ఆందోళన ముందువెనుకల్ని ఆలోచించనీయదు. కార్యశీలతకు భంగకరం కూడా. దూరాన వస్తున్న రామలక్ష్మణుల్ని మొదటి సారిగా చూసిన సుగ్రీవుడు విపరీతమైన టెన్షన్‌కి (ఉద్విగ్నానికి) లోనై, అటూ ఇటూ పచార్లు చేస్తుండగా, హనుమంతుడు గమనించి-" నువ్వు ప్రశాంతతని కోల్పోతే ఏపనీ చేయలేవు. వారిద్దర్నీ చూసి, 'వాలి నీ పైకి పంపిన బలవంతులైన యోధులు' అని నిర్ణయించుకొని భయపడుతున్నావు. కానీ అది రూఢి కాలేదు. ఏమీ తేలకుండానే ఉద్విగ్నపడే మనస్తత్వమున్న వాడు కార్యదక్షుడు కాలేడు" అని మందలించి, తాను స్వయంగా వెళ్ళి, రామలక్ష్మణుల సమాచారం గ్రహించాడు. వారిని సుగ్రీవునికి మిత్రులుగా చేసి మహోపకారం చేశాడు. కేవలం కథా దృష్టితో చూస్తే -మారీచుడు మాయాజాలంతో రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ అరచిన ధ్వనికి - వేగిరపడిని సీతమ్మ ఆందోళనే మాటల్లో వర్ణించలేనంత టెన్షన్‌కి గురయింది. ఆ టెన్షనే చికరికి ఆమె అపహరణం వరకు దారితీసింది. భయచకితమైన మానసిక స్థితిలో తీసుకొనే నిర్ణయాలు ప్రమాదాలకి దారితీస్తాయి.

జరగవలసింది జరగకమానదు - అనే ధోరణి ఒక విధంగా మనశ్శాంతినీ, ఊరటనీ ఇస్తుందనేది వాస్తవమే. కానీ ఈ ధోరణి మన ప్రయత్నాన్ని కుంటుపరచదా? అని కొందరి సందేహం. ఏ సిద్ధాంతాన్నైనా ఎలా, ఎంతవరకు స్వీకరించాలి? అనేది మనయుక్తిపై ఆధారపడి ఉంటుంది భారతీయుల కర్మ సిద్ధాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే చక్కని మన:స్థితిని ఏర్పడుతుంది. కర్మకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదు. మన ప్రయత్నం మనం చేసినా తొలగించలేని దానినే ప్రారబ్ధం అంటాం. పురుష ప్రయత్నం తో చేసినదే కదా! ఇది వరకటి కర్మలఫలానికే 'అదృష్టం' 'దైవం' 'భాగ్యం' అని పేరు. ప్రపంచంలో అందరూ ఒకేలా ఉండరు. ఎవరి 'అదృష్టం' వారిది. అలాగని ప్రయత్నం మానం. ప్రయత్నానికి 'పౌరుషం' అని పేరు. మన ప్రయత్నం దృఢంగా, ఏకాగ్రంగా, పట్టుదలగా ఉంటే అదృష్టాన్ని కూడా మార్చవచ్చు అని శాస్త్రం. 'అదృష్టం ఇంతే' అని సరిపెట్టుకునే స్థితి మనసుకి శాంతినిస్తుంది. పట్టుదలగా కృషి చేసేవాడూ ఆందోళనని ప్రక్కకి పెడతాడు.రెండింటికీ చెందని బలహీనుడే అశాంతి పాలవుతాడు. మన కృషికి తగినదీ, మన అవసరాలను తీర్చేదీ అయిన సంపాదనతో తృప్తిపడడం నేర్చుకోవాలి. పోటీ, ఆందోళన లేకుండా ధర్మబద్ధంగా ప్రయత్నించడానికి సాధన చేయాలి. కొందరు ఎల్లప్పుడూ తామున్న ఉద్యోగం, స్థితి విషయంలో అసంతృప్తి గానే గడుపుతుంటారు. 'గతిలేక అందులో ఉన్నాం' అనే భావన లో ఉంటారు. ఇది కూడా ఒక విధమైన మానసిక రుగ్మతయే. 'ఎవరెక్కడవుండాలో అక్కడే సరిగ్గాఉంచబడ్డారు' (Everyone is rightly placed) అనే ఆంగ్లనానుడి కర్మ సిద్ధాంతానికి దగ్గరిదే.

# గొంతు నొప్పి, గర గరలకు మంచి చిట్కాలు

సాధారణంగా మనం తినే పదార్థాల్లో ఏమాత్రం తేడా ఉన్న అది వెంటనే గొంతుపై నాలుకపై ప్రభావం చూపిస్తుంది. గొంతులో గర గర లాడటం.. నొప్పివేయడం లాంటి జరుగుతుంది. ఎక్కువ చల్లదనం ఉన్న పదార్థాలు, ద్రవపదార్థాలు తిన్నా, తాగినా ఇలాంటి ఇబ్బంది వస్తుంది. లేదా ఎక్కవ కారం ఉన్న, మసాలా పదార్థాలు ఉన్నవి తీసుకున్నా గొంతుపై ప్రభావం చూపిస్తుంది.

ప్రతి ఇంట్లో పసుపు తప్పకుండా ఉంటుంది. దీనిలో యాంటీ బాక్టీరియల్ గుణాలు ఎక్కువ. గొంతులో మంట విపరీతంగా ఉంటే.. పాలల్లో చిటికెడు పసుపు వేసుకొని తాగాలి.

దాల్చిన చెక్క నూనెలో తేనె కలిపి తాగితే తక్షణ ఉపశమనం కలుగుతుంది. వీలైతే వేడినీటిలో తేనె కలిపి పుక్కిలించినా మంచిదే. వెల్లుల్లిలో ఉండే యాంటీ బాక్టీరియల్, యాంటీ సెప్టిక్ గుణాలు అధికం.

వేడివేడి అన్నంలో వెల్లుల్లి, ఉప్పు, కారం కలిపి తింటే మంచిది.

గ్లాసు నీళ్లల్లో దాల్చిన చెక్క, మిరియాల పొడి, కలిపి పుక్కిలించాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేయాలి. అంతే గొంతులోని గరగర మటుమాయమవుతుంది.

# నా మాటల్ని 100శాతం వక్రీకరించారు

## - రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



తిరుపతి: "ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలనే ఆలోచన తప్పు.. ఎల్లో మీడియాకు మరోకటి రాయాలనిపించడం లేదు.. నేను మాట్లాడింది కాకుండా.. ఎల్లో మీడియా ఇష్టం వచ్చినట్లు రాసింది.. నా మాటల్ని 100 శాతం వక్రీకరించింది" అంటూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "ఎల్లో మీడియా దివాళాకోరుతనంగా వ్యవహరిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ గెలుపును ఓర్చుకోలేక పోతున్నారు. చంద్రబాబు చెప్పిందే ఎల్లో మీడియా రాస్తోంది. బాబు, ఎల్లో మీడియా కలిసి కుట్రలు పన్నుతున్నారు" అంటూ మండిపడ్డారు.

రఘురామ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై పెద్దిరెడ్డి మండిపడ్డారు. ఆయన ఎల్లో మీడియాకు బంట్రోతుగా వ్యవహరిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. "రఘురామకృష్ణంరాజు సిగ్గులే కుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడు తున్నారు. సిగ్గుంటే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి. వార్డు మెంబర్ కాని రఘురామ కృష్ణంరాజు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో ఎంపీ అయ్యారు. కొమ్ములు లేని దున్నపోతుతో ఆయనను పోల్చవచ్చు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు పెద్దిరెడ్డి.

"చంద్రబాబు స్క్రిప్ట్‌నే ఆయన చదువుతున్నారు. బ్యాంకులను వేల కోట్లు మోసం చేసిన చరిత్ర రఘురామ కృష్ణంరాజుది. దమ్ముంటే ఆయన తన పదవికి రాజీనామా చేసి గెలవాలి. ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబు హుందాగా వ్యవహరించాలి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో రఘురామ కృష్ణంరాజు ఎంపీగా గెలిచారు.. సీఎం జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు తనకు లేదు. చంద్రబాబు వ్యవహారమంతా చీకటి ఒప్పందాలు చేసుకోవడమే" అంటూ పెద్దిరెడ్డి మండిపడ్డారు.





వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ప్రముఖ ఆడిటర్ జి.వి కుమారుని మరణ వార్త విని జీవి నివాసానికి చేరుకుని జీవి కుటుంబ సభ్యులను ఓదార్చాతున్న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎం పి ఎంవివి సత్యనారాయణ మరియు నగర ప్రముఖులు



రాజ్యసభ మాజీ సభ్యులు, పూర్వ కేంద్ర మంత్రి డాక్టర్ టి సుబ్బిరామి రెడ్డి ని విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ లో స్వాగతం పలికి అనంతరం విశాఖ శ్రీ శారద పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర మహా స్వామి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది.ం

# ప్రధాని మోదీ తల్లికి కరోనా టీకా



దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాతృమూర్తి హీరాబెన్ కరోనా వ్యాక్సిన్ తీసుకున్నారు. ఈ విషయాన్ని మోదీ స్వయంగా ట్విటర్ ద్వారా వెల్లడించారు. "ఈ రోజు మా అమ్మ కొవిడ్ టీకా తొలి డోసు తీసుకున్నారు. మీ చుట్టూ ఉన్న అర్హులైన వారు కూడా వ్యాక్సిన్ వేయించుకునేలా వారిని ప్రోత్సహించాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నా" అని ప్రధాని ట్వీట్ చేశారు. అయితే ఆమె ఏ టీకా.. ఎక్కడ తీసుకున్నారన్న విషయాన్ని ఆయన వెల్లడించలేదు. 99ఏళ్ల హీరాబెన్ ప్రస్తుతం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో తన చిన్నకుమారుడు పంకజ్ మోదీ వద్ద ఉంటోన్న విషయం తెలిసిందే.

కరోనా మహమ్మారిని తరిమికొట్టే బృహత్తర కార్యక్రమంలో భాగంగా టీకా పంపిణీ కార్యక్రమం దేశంలో నిరాటంకంగా కొనసాగుతోంది. జనవరి 16న వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించగా.. మార్చి 1 నుంచి 60ఏళ్లు పైబడిన వృద్ధులు, 45-59ఏళ్ల మధ్య వయస్కుల్లో దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు టీకాలు ఇస్తున్నారు. మార్చి 1న ప్రధాని మోదీ దిల్లీలోని ఎయిమ్స్‌లో వ్యాక్సిన్ తొలి డోసు తీసుకున్న తర్వాత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు, పలురాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు కూడా వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 2.5కోట్ల మందికి పైగా టీకాలు వేసినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది.

# పరీక్షల్లో 'తెలుగు' తప్పనిసరి

## - టెన్త్ పరీక్షలపై హెచ్ఎంలకు సూచనలు

## - జారీచేసిన ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్

## - ఇంటర్నల్ మార్కులకు 'నో వెయిటేజి'

అమరావతి: ఈ ఏడాది జూన్‌లో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్యాట్రన్‌లో మార్పులు, గ్రూప్ కాంబినేషన్లు, నామినల్ రోల్స్, ఇతర అంశాలకు సంబంధించి ప్రధానోపాధ్యాయులకు సవివర సూచనలను చేస్తూ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఎ.సుబ్బారెడ్డి బుధవారం సర్క్యులర్ విడుదల చేశారు. పరీక్ష పేపర్లు, సమయం, మార్కులు తదితర అంశాలను అందులో వివరించారు. ఈ సర్క్యులర్ ప్రకారం.. ఈ పరీక్షలకు తొలిసారి హాజరయ్యే రెగ్యులర్ విద్యార్థులంతా తెలుగు భాషను ఫస్ట్ లాంగ్వేజ్ లేదా సెకండ్ లాంగ్వేజ్ కింద%ా% తప్పనిసరిగా రాయాలి.



తెలుగు ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్‌గా ఉన్న విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ కింద హిందీ తప్పనిసరిగా రాయాలి. ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులు ఫస్ట్ లాంగ్వేజ్‌గా తెలుగును ఎంచుకుంటే సెకండ్ లాంగ్వేజ్ పేపర్‌గా హిందీని మాత్రమే ఎంపిక చేసుకోవాలి. తమిళం, కన్నడ, ఒరియా తదితర మాతృభాషలను ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఎంచుకున్న విద్యార్థులు రెండో పేపర్‌గా తెలుగును తప్పనిసరిగా రాయాలి. పబ్లిక్ పరీక్షల్లో.. ఇంటర్నల్ మార్కులకు వెయిటేజీ ఉండదు. ఏడు పేపర్లలో ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్, థర్డ్ లాంగ్వేజ్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ పరీక్షలు ఒక్కొక్కటి 100 మార్కులకు ఉంటాయి. ఫిజికల్ సైన్సు, బయోలాజికల్ సైన్సు పరీక్షలు 50 మార్కుల చొప్పున వేర్వేరుగా ఉంటాయి. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ పేపర్ 1.. 70 మార్కులకు, పేపర్ --2.. 30 మార్కులకు ఉంటాయి. లాంగ్వేజ్ పరీక్షలు, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ పరీక్షలు రాసేందుకు ఒక్కో పేపర్‌కు 3 గంటలు, ప్రశ్నపత్రం చదువుకునేందుకు 15 నిమిషాల (మొత్తం 3 గంటల 15 నిమిషాలు) సమయం ఇస్తారు. ఫిజికల్ సైన్సు, బయోలాజికల్ సైన్సు పరీక్షలు రాసేందుకు 2.30 గంటలు, ప్రశ్నపత్రం చదువుకునేందుకు 15 నిమిషాలు (మొత్తం 2 గంటల 45 నిమిషాలు) ఇస్తారు. 2017 మార్చిలో మొదటిసారి టెన్త్ పరీక్షలకు హాజరై 2019 జూన్ వరకు ఆ పరీక్షలను పూర్తిచేయనివారు కొత్త స్కీమ్‌లో ప్రస్తుతం నిర్వహించే పరీక్షలకు రిజిష్టర్ కావచ్చు. ఇంటిపేరుతో సహా అభ్యర్థి పూర్తిపేరు, తండ్రి, తల్లి పూర్తి పేర్లు నమోదు చేయాలి. అనాథలకు సంరక్షకుల పేరు నమోదు చేయాలి స్కూలు రికార్డుల్లో నమోదైన వారిని మాత్రమే రెగ్యులర్ అభ్యర్థులుగా పరిగణిస్తారు.

గుర్తింపు ఉన్న స్కూలు నామినల్ రోల్స్ మాత్రమే రెగ్యులర్ అభ్యర్థులుగా అప్‌లోడ్ చేయాలి.


చెవిటి, మూగ, అంధత్వం తదితర బహుళ దివ్యాంగులకు రెండు లాంగ్వేజ్‌లకు బదులు ఒక్కటే ఎంచుకోవచ్చు. వీరికి ప్రతి సబ్జెక్టులో పాస్ మార్కులు 20 మాత్రమే.

# నగర ఓటరూ స్ఫూర్తి...

# వైయస్ఆర్‌సిపి గెలుపునకు నాంది

- ఓటర్ల ప్రోత్సాహం మా బాధ్యత మరింత పెంచింది
- టీడీపీ కుట్రలను ఎండగట్టి కార్యకర్తలకు ధన్యవాదాలు
- వైస్సార్సీపీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్
- జగనన్న ప్రోత్సాహం తో విశాఖ అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపు

విశాఖపట్నం : జీవీఎంసీ ఎన్నికల్లో నగర ఓటర్లు చూపించిన స్ఫూర్తి వైస్సార్సీపీ గెలుపుకు నాంది అని.. పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల్లో నగర ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ స్టేషన్స్ కు తరలి వచ్చి పోలింగ్ శాతాన్ని గతంలో కంటే పెంచారన్నారు. ఈ ఓటింగ్ స్ఫూర్తి వైస్సార్సీపీ గెలుపుకు పునాది అన్నారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ ను నిర్వహించిన ప్రభుత్వానికి.. ఎన్నికల కమిషన్ కు కృతజ్ఞతలు తెలిపారు. కొన్నిచోట్ల టీడీపీ దౌర్జన్యాలకు దిగిందన్న ఆయన.. ఆయా కుట్రలను అడ్డుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. విశాఖ ఓటరు తీర్పుతో జీవీఎంసీ మేయర్ పీఠం వైస్సార్సీపీ ఖాతాలో చేరనుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుకుందామన్నారు. విశాఖ పై జగనన్నకు ఉన్న ప్రేమకు నిదర్శనమే... కార్యనిర్వాహక రాజధాని ప్రకటన కు ప్రతీక అన్నారు. దీన్ని విశ్వసించిన నగర ఓటర్లు వైస్సార్సీపీ కి పట్టం కట్టారన్నారు. విశాఖకు త్వరలో మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఎంపీ విజయసాయి రెడ్డి నాయకత్వం పార్టీ విశాఖ అభివృద్ధి కి కృతనిత్యయంతో ఉందని వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. స్టీల్ ప్లాంట్ విషయం లోను



ముఖ్యమంత్రి అత్యంత చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నారన్నారు. త్వరలో ఢీల్లికి అఖిలపక్షంకు తీసుకెళ్లే బాధ్యత ముఖ్యమంత్రి జగనన్న తీసుకోవడం ఆయని చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఈ విషయంలో టీడీపీ, ఇతర పార్టీల చౌకబారు రాజకీయాలను నగర ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. జీవీఎంసీ పీఠంపై వైస్సార్సీపీ జెండా ఎగిరిన తరువాత నగర అభివృద్ధి వెల్లువలా ఆయా పార్టీలు కొట్టుకు పోతాయన్నారు. అప్పటి వరకు వైస్సార్సీపీ నాయకులు.. కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఆయా పార్టీల చౌకభారీ రాజకీయాలను సమన్వయంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు..

### శ్రీ త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో


# ఎమ్మెల్యే రోజా ప్రత్యేక పూజలు



నగరి : నియోజకవర్గ పరిధిలోని నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు లోని శ్రీ త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో నగరి శాసనసభ్యురాలు ఆర్.కె.రోజా, సెల్వమణి దంపతులు, లక్ష్మి గురువారం మహా శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, బాలాజీ, యాకోబు, ధయానిధి, దయా, చిన్నా, ఆర్ముగం, నరేష్, రమేష్, సుబ్రహ్మణ్యస్వామి, కృష్ణమూర్తి, భారతి, గణేష్, తులసిరామి రెడ్డి, ఆల్బర్ట్, లోకేష్, లోకనాద రెడ్డి, సురేష్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు ఉద్యమంపై చిరంజీవి ట్వీట్



హైదరాబాద్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఉద్యమానికి ప్రముఖ సినీనటుడు చిరంజీవి మద్దతు ప్రకటించారు. ఉక్కు సంకల్పంతో విశాఖ ఉక్కును కాపాడుకుందామని పిలుపునిచ్చారు. తాను విద్యార్థిగా ఉన్న సమయంలో విశాఖ ఉక్కు పరిశ్రమ సాధన కోసం జరిగిన పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ ట్వీట్ చేశారు. "విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పరిరక్షణ కమిటీ చేస్తున్న పోరాటానికి నా మద్దతు ప్రకటిస్తున్నాను. 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా మోగిన ఆనాటి నినాదాలు ఇంకా నా చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. నర్సాపురం వైఎన్ఎం కాలేజీలో చదివే రోజుల్లో బ్రష్ చేతబట్టి గోడల మీద 'విశాఖ ఉక్కు సాధిస్తాం' అనే నినాదాన్ని రాశాం. హర్తాళ్లు, ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు చేశాం. దాదాపు 35 మంది పౌరులతో పాటు తొమ్మిదేళ్ల బాలుడు కూడా ప్రాణార్పణ చేసిన ఆనాటి మహోద్యమ త్యాగాల ఫలితంగా సాకారమైన విశాఖ ఉక్కు కర్మాగారం ఉత్పత్తి ప్రారంభమైనప్పుడు అందరం సంబరాలు చేసుకున్నాం. అది ఆంధ్రుల హక్కుగా, ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీకగా భావించి సంతోషించాం.

# మరోసారి విజృంభిస్తోన్న మహమ్మారి

దిల్లీ: దేశంలో కరోనా వైరస్ మరోసారి ప్రతాపం చూపిస్తోంది. కరోనా కేసుల్లో కొద్ది రోజులుగా పెరుగుదల కనిపిస్తున్నప్పటికీ, గడిచిన 24 గంటల్లో వాటి సంఖ్య భారీగా పెరిగింది. రోజువారీ కేసుల సంఖ్య రెండు నెలల గరిష్ఠానికి చేరింది. 7,78,416 మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా..22,854 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. 126 మంది మృత్యు ఒడికి చేరుకున్నారు. దాంతో మొత్తం కేసులు సంఖ్య 1,12,85,561కి చేరగా.. 1,58,189 మంది ప్రాణాలు వదిలారని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. కొత్త కేసులు ఎక్కువవుతుండటంతో క్రియాశీల కేసుల్లో కూడా పెరుగుదల కనిపించింది. ప్రస్తుతం 1,89,226 క్రియాశీల కేసులుండగా..ఆ రేటు 1.68 శాతానికి చేరింది. అయితే వైరస్ నుంచి కోలుకుంటున్న వారి సంఖ్య కాస్త మెరుగ్గానే ఉంది.








Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com